ప్రజాశక్తి

గురువారం 18 సెప్టెంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి







ప్రయివేటీకరణ జపం

- పారిశ్రామిక వేత్తల సదస్సులో చంద్రబాబు, నిర్మలాసీతారామన్
- ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాన్ని సమర్థించుకున్న వైనం
- పదేపదే అభివృద్ధి పలుకులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

అంతా ఊహించిన విధంగానే విశాఖ సాగరతీరంలోని రాడిషన్ బ్లూ-ఆర్క్.బీచ్‌లోని ఏయూ కన్వెన్షన్ సెంటర్లలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సిఐఐ-జిసిసి ఆధ్వర్యాన నిర్వహించిన పారిశ్రామిక వేత్తల సదస్సులో ప్రయివేటీకరణ జపం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 5వేల మంది కాంట్రాక్టు కార్మికులను కేంద్రం, యాజమాన్యం తొలగించేసి అన్ని తరగతుల విమర్శలను ఎదుర్కొంటున్నా అదే కరెక్టు అంటూ ఊదరగొట్టారు. ప్లాంట్‌లో ఏళ్లతరబడి పనిచేసే కార్మికులను నెట్టేసి, బయట రాష్ట్రాల నుంచి కార్మికులను అద్దెకు తెచ్చిన యాజమాన్యానికి ఈ వ్యాఖ్యలు ఊతమిస్తున్నాయి. 42 డిపార్టుమెంట్‌లను ఇఒఐ పేరుతో బడా కాంట్రాక్టర్లకు కట్టబెట్టినా ప్రయివేటీకరణ విధానంతోనే దేశం అభివృద్ధి అవుతుందంటూ చంద్రబాబు, నిర్మలా సీతారామన్ ఊదరగొట్టడం కనిపించింది. 'ఎవరేమనుకున్నా నవ్వుకున్నా మాకేటి' అన్న చందంగా రాడిషన్ బ్లూలో జరిగిన జిసిసి సమ్మిట్‌లో ఎపి కంటే చంద్రబాబు హైదరాబాద్‌ను తాను అభివృద్ధి చేశానంటూ ప్రసంగాన్ని తిప్పడం అందరిలో విసుగు కలిగించింది. ఇంకొంచెం ముందుకెళ్లి 'మోడీ మన జాతీయ ఆస్థి' అంటూ కితాబిచ్చాడు చంద్రబాబు.

తెలంగాణపై అధిక ప్రసంగం...

హైదరాబాద్‌ను తానే అభివృద్ధి చేశానంటూ అక్కడ రోడ్లు, ఎయిర్ పోర్టు, ఐటి భవనాల గురించి చంద్రబాబు తన ప్రసంగం 40 నిమిషాల్లో సగభాగం ఆక్రమించారు. హైదరాబాద్‌లో బ్రౌన్ ఫీల్డు ఎయిర్‌పోర్టు కట్టానని, అమరావతిలో గ్రీన్‌ఫీల్డు కడుతున్నానని చెప్పుకున్నారు. విశాఖ గొప్పనగరం ఇక్కడ సముద్రం, అందమైన కొండలు ఉన్నాయంటూ షరామామూలుగా ఊదరగొట్టడం కనిపించింది. గతంలో తాను రాష్ట్రంలోని ప్రతి ఇంటి నుంచి ఒక ఐటి ఉద్యోగి అన్న నినాదం సక్సెస్ అయ్యిందని, అందుకే తాజాగా ఒక కుటుంబం నుంచి ఒక పారిశ్రామిక వేత్త రావాలన్న నినాదం 2024లో

మిగతా 2లో..

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

- ప్రతి కుటుంబానికీ రూ.2.5 లక్షల ఆరోగ్య బీమా
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి హాజరయ్యారు. ముందుగా ప్రధానమంత్రి మోడీ ప్రసంగాన్ని లైవ్‌లో వీక్షించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, 'పేదల అభ్యున్నతి, మహిళల ఆరోగ్యంపై ప్రధాని మోడీ ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం అంతా ఆరోగ్యంగా ఉంటుందని, తద్వారా రాష్ట్రం బాగుంటుందని, మంచి ఆరోగ్యం కోసం చక్కెర, ఉప్పు, నూనె వాడకాలను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. బుధవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ వైద్య పరీక్షలు నిర్వహిస్తామని, మహిళలు వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రమంతటా 13,944 హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, తల్లిబిడ్డా ఆరోగ్య రక్షణ కోసం కార్డులు జారీ, గర్భిణుల సంరక్షణతో పాటు పిల్లలకు టీకాలు వేయడంపై దృష్టి పెట్టామని చెప్పారు. రక్తహీనత, పౌష్టికాహారంపై అవగాహన

మిగతా 2లో..





స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్‌లో మాట్లాడుతున్న చంద్రబాబు (ఇన్‌సెట్‌లో వ్యాక్సిన్ వేస్తున్న సిఎం)

గీతం మెడికల్ విద్యార్థి ఆత్మహత్య

వార్త మెయిన్‌లో..

వేధింపులు తాళలేక వెలుగు ఆర్‌పి ఆత్మహత్యాయత్నం

వార్త 3లో..

యూరియా రాయితీ పేరుతో రైతులను మోసగిస్తున్న కూటమి ప్రభుత్వం

వార్త 5లో..



నాలుగో రోజు దీక్షలో కూర్చున్న మత్స్యకారులు

'బల్క్ డ్రగ్'ను రద్దు చేస్తూ అసెంబ్లీలో ప్రకటించాలి

వార్తలు మెయిన్, లోపలి పేజీల్లో..

మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం సిగ్గుచేటు : వాసుపల్లి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయడం సిగ్గుచేటని వైసిపి దక్షిణ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఎద్దేవా చేశారు. అశీలుమెట్టలోని కార్యాలయంలో బుధవారం వైసిపి నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసిపి నాయకత్వంలో ఈ నెల 19వ తేదీన పాడేరు మెడికల్ కాలేజీ వద్ద జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైసిపి హయంలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. ఇందులో 10 కళాశాలల నిర్మాణానికి రూ.4,500 కోట్లు అవసరం అన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఇందుకు నిధులు లేవని చెప్పడం హాస్యాస్పదం అన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం చేస్తే పేద, మధ్య తరగతి విద్యార్థులకు సీట్లు రావని ఆందోళన వ్యక్తం చేశారు. మేనేజ్‌మెంట్ కోటలో యాజమాన్యాలు సీట్లు అమ్మేసుకుంటాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఎర్నిమాంబ ఆలయ చైర్మన్ లండ రమణ, కనకల ఈశ్వరరావు, పీతలు వాసు, దశ మంతలు మాణిక్యాలరావు, మహమ్మద్ షకిల్, మహమ్మద్ ముజీబ్ ఖాన్, గంగళ్ల రామరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల చోరీపై కాంగ్రెస్ సంతకాల సేకరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కేంద్ర ఎన్నికల కమిషన్ ఓట్ల అవకతవకలపై ఎఐసిసి ఆదేశాల మేరకు నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో 31వ వార్డు పరిధిలో ఓటర్ల నుండి సంతకాల సేకరణ బుధవారం చేపట్టారు. ముందుగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మరాజు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సంతకాల సేకరణపై దిశ నిర్దేశం చేశారు. అనంతరం చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లక్కరాజు రామారావు, స్పోర్ట్ సెల్ చైర్మన్ కమలాకర్, దక్షిణ ఇన్‌ఛార్జి కెవి.సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి వంకర ఆనంద కుమార్, కస్తూరి వెంకటరావు, బాషా, జగన్, అప్పలనాయుడు, ఆలీ, రాజేష్, ప్రసాద్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



ఓట్ల చోరీపై సంతకాలు సేకరిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మొదటి పేజీ తరువాయి..

ప్రయివేటీకరణ జపం

తెచ్చానంటూ చెప్పుకొచ్చారు. పేదరికం నిర్మూలనకు సంపద సృష్టించాలని రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు అభివృద్ధికి కొంతమంది బడా పారిశ్రామిక వేత్తలను ఎంచుకున్నట్లు చంద్రబాబు చెబుతూ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తిరుపతి అదానికి, అనంతపురం జిల్లాను జిందాల్‌కు, విజయవాడను మెగాకు అహ్వానం పలికానని వివరించుకున్నారు. కేంద్రం, రాష్ట్రంలోనూ ఒకే ప్రభుత్వం 'డబుల్ ఇంజిన్ సర్కారు...గ్రోత్ కూడా డబుల్ కాబోతోందని, చైనా కంటే మనం ఏం తక్కువ? అంటూ బుల్లెట్ ట్రైన్‌లు ఏపిలోనూ తెస్తానని చంద్రబాబు చెప్పుకొచ్చారు. పిపిపిలో 50 కిలోమీటర్లకు రాష్ట్రంలో ఒక పోర్టు, రాష్ట్రంలో 6 ఎయిర్‌పోర్టులను నిర్మిస్తానని ఓర్వకల్లు, పుట్టపర్తిలో ఇప్పటికే ప్లాన్ రూపొందించానని, ఇదంతా 2047 నాటికి దేశంలోనే ఏపిని నెంబర్ 1 స్థానంలో నిలబెట్టడం కోసమేనని చంద్రబాబు 'విజన్' చెప్పడం విశేషం.

'ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలు కొన్ని ప్రభుత్వం చేతుల్లో ఉండకూడదని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానం తీసుకుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను 2021 జనవరి 27న వ్యూహాత్మక అమ్మకానికి పెట్టిన సంగతిని సభికుల్లో పలువురు గుర్తుకు తెచ్చుకోవడం, గుసగుసలాడడం కనిపించింది. కేంద్ర ఆర్థిక మంత్రి వ్యాఖ్యలతో 'కూటమి' పార్టీలు ఇరుకున పడ్డట్టయింది.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

కళ్లిస్తామని, హైబీపీ, సుగర్, ఓరల్, రొమ్ము, సర్వైకల్ కేన్సర్, టీబీ తదితర అన్నిరకాల వైద్య పరీక్షలు ఈ కార్యక్రమం ద్వారా ఉచితంగా చేస్తామని తెలిపారు.

ఈ ఏడాది ఆరోగ్యరంగానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.19,264 కోట్ల వ్యయం చేస్తోందని తెలిపారు. ప్రతి కుటుంబానికి యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ తీసుకొచ్చామని, రాష్ట్రంలో అందరికీ రూ.2.5 లక్షల వరకూ ఉచితంగా ఆరోగ్య బీమా కల్పిస్తున్నామని తెలిపారు. పేదలకు రూ.25 లక్షల వరకూ వైద్య చికిత్సలకు అయ్యే ఖర్చును ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్టు భరిస్తుందని వివరించారు..

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఎయు సాగరిక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన వైద్య పరీక్షల స్టాల్స్ ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. వైద్య పరీక్షలకు సంబంధించిన వివరాలను, ఈ కార్యక్రమ ఉద్దేశాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, కమిషనర్ వీరపాండ్యన్ ముఖ్యమంత్రికి వివరించారు. పేషెంట్లు, వైద్యులతో ముఖ్యమంత్రి ముఖాముఖి మాట్లాడారు. కేన్సర్ స్క్రీనింగ్‌పై మరింత అవగాహన పెంచాలని, మహిళలు ముందుకొచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. స్టాల్స్‌లో ముఖ్యమంత్రి ఒక పాపకు వ్యాక్సిన్ వేసి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎన్‌సిడి 4.0 హౌస్ హోల్డ్ సర్వే, స్క్రీనింగ్ కార్యాక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా వర్చువల్‌గా ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఆరోగ్య డేటా ఆన్ లైన్ చేయాలని, సికిల్ సెల్ ఎనీమియా వ్యాప్తిని అరికట్టాలని, అనువంశిక వ్యాధులు సంక్రమించకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 18 మంది ప్రోగ్రాం అధికారులు, 22 మంది స్పెషలిస్టు డాక్టర్లు, 18 మంది డ్యూటీ డాక్టర్లు, 20 మంది నర్సింగ్ సిబ్బంది, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర సిబ్బంది పాల్గొని, గైనిక్, పిడియాట్రిక్, ఆంకాలజీ, డెర్మటాలజీ, డెంటల్ ఆప్తాలమిక్, ఇఎన్‌టి పరీక్షలు నిర్వహించారు. రక్త పరీక్షలు చేశారు.

ఉపాధ్యాయ బదిలీ జిఒలో 'రిక్వెస్ట్ గ్రౌండ్స్' పదం కొనసాగించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ఉపాధ్యాయుల బదిలీల కోసం విడుదల చేసిన జిఒలో రిక్వెస్ట్‌గ్రౌండ్స్ పదాన్ని తొలగించడం సరికాదని, దానిని యధావిధిగా కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వై.దేముడు, ప్రధాన కార్యదర్శి జి.దత్తాత్రేయ శర్మ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి యూనియన్ తరఫున లేఖ రాయడం జరిగిందని వారు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలలో 10 నుంచి 15 సంవత్సరాల పైబడి ఇతర ప్రాంతాల్లో పనిచేయటం వల్ల అనేక కుటుంబాలు అశాంతి సమస్యలను ఎదుర్కొంటున్నాయన్నారు. అంతర్ జిల్లాల బదిలీలు రిక్వెస్ట్ గ్రౌండ్స్‌పై కౌన్సిలింగ్ నిర్వహించడానికి ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పెరియార్ ఇవి రామస్వామికి ఘన నివాళి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పెరియార్ ఇవి రామస్వామి 147వ జయంతిని బీచ్ రోడ్డులోని ఆయన విగ్రహం వద్ద భారత నాస్తిక సమాజం, పెరియార్ ఆశయ సాధన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైటర్స్ అకాడమీ చైర్మన్, లీడర్ దినపత్రిక ఎడిటర్ వివి.రమణమూర్తి మాట్లాడుతూ, నూతన యుగం ప్రవక్త, ఆగ్నేయ ఆసియా దేశాల సోక్రటీస్, సంఘసంస్కరణ ఉద్యమానికి తండ్రి, అజ్ఞానానికి, మూఢనమ్మకాలకు అర్థ రహిత సంప్రదాయాలకు, నీచమైన ఆచారాలకు బద్ధ శత్రువుగా యునెస్కోచేత కొనియాడబడిన పెరియార్ ఇవి రామసామి దేశంలో 90 శాతం పైగా ఉన్న అణగారిన, వెనుకబడిన కులాల అభ్యున్నతికై జీవితాంతం కృషిచేశారని కొనియాడారు. భారత నాస్తిక సమాజం జాతీయ కన్వీనర్ జె.రవి మాట్లాడుతూ, మహిళల స్వేచ్ఛ పట్ల పెరియార్ అభిప్రాయాలు విప్లవాత్మకమైనవన్నారు. పీడిత కుల ప్రజలకు, సాంఘిక ఆర్థిక రాజకీయ అణిచివేతల నుంచి విముక్తికై పెరియార్ సాగించిన ఉద్యమం, చేపట్టిన సిద్ధాంతం విలక్షణమైనదని భారత నాస్తిక సమాజం రాష్ట్ర నాయకులు టి.



పెరియార్ ఇవి రామస్వామి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

శ్రీరామమూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎం.పైడిరాజు, పెరియార్ ఆశయ సాధన సంఘం కార్యదర్శి పి.పెంటారావు, దళిత సేన నాయకులు గణపతి, న్యాయవాది సురేష్, భారత నాస్తిక సమాజం నాయకులు వై.నూకరాజు, సునీత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో తెలుగు మహనీయుల విగ్రహాలు నిర్మించాలి



ప్రచార కార్యక్రమాల పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ట్యాంక్ బండ్ తరహాలో రాజధాని అమరావతిలో తెలుగు మహనీయుల విగ్రహాలు నిర్మించాలని ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి కోరారు. చైతన్య వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార కార్యక్రమం బుధవారం నగరానికి చేరుకుంది. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ముందుగా నవ్యాంధ్ర రాష్ట్ర సాంస్కృతిక చైతన్య ప్రచార కళాయాత్ర బ్యానర్‌ను, కరపత్రాలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రాజధాని అమరావతి నిర్మాణం చర్యలను వేగవంతం చేసిందని, ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఐదు ప్రధాన విజ్ఞప్తులు చేస్తూ, నవ్యాంధ్ర రాష్ట్ర సాంస్కృతిక చైతన్య ప్రచార కార్యక్రమం, కళా యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర రాజధానిలో కృష్ణా నదికి ఇరువైపులా హైదరాబాదు వలె ట్యాంక్ బండ్ నిర్మించి 100 మంది తెలుగు ప్రసిద్ధ మహనీయుల విగ్రహాలను నిర్మించి భావితరాలకు అందించాలన్నారు. అమరావతిలో పద్మశ్రీ ఘంటసాల 25 అడుగుల భారీ విగ్రహం, కళాక్షేత్రం ఏర్పాటుచేయాలని, తెలుగు సినీ స్వర్ణత్రయం ఎన్‌టిఆర్, ఎఎన్‌ఆర్ ఘంటసాలకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి భారతరత్న ప్రకటించాలన్నారు. తెలుగు భాష పరిరక్షణ, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర చైతన్య వేదిక యూత్ కమిటీ సభ్యులు రాపాక హరీష్, తాడి రామసూర్యారెడ్డి, హోగాపురం జన్నారెడ్డి, గార్ల ప్రసాద్, ఆటల లక్ష్మి, పిసూర్యకుమారి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

చంద్రబాబుకు గంట్ల వినతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అక్రిడిటేషన్ జిఒలో సడలింపులు ఇవ్వాలని, మీడియా కమిషన్ ఏర్పాటుచేయాలని, పెన్షన్ సదుపాయం కల్పించాలని తదితర 11 డిమాండ్లతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు వినతిపత్రం అందించారు. బుధవారం



చంద్రబాబుకు వినతిపత్రం అందిస్తున్న గంట్ల శ్రీనుబాబు

విశాఖపట్నం ఎయిర్ పోర్టులో చంద్రబాబును కలిసి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వపరంగా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని గంట్ల శ్రీనుబాబు తెలిపారు. సింహాచలం అప్పన్న భూ సమస్యను పరిష్కరించాలని కూడా వినతిపత్రం అందించినట్లు చెప్పారు.

'బిల్డర్ నుంచి రక్షణ కల్పించండి'

ప్రజాశక్తి , ఎంవిపి కాలనీ: తన స్థలాన్ని డెవలప్‌మెంట్‌కు ఇచ్చిన బిల్డర్ నుండి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని నగరానికి చెందిన కటారి రమేష్‌చంద్రరాజు కోరారు. వియంఆర్‌డిఎ పార్కు సమీపంలోని ఈస్ట్ పాయింట్‌లో 6-18-4 డోర్ నెంబర్ స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మించేందుకు కె.గిరీష్‌బాబుకు మూడేళ్ల కిందట డెవలప్‌మెంట్‌కు ఇచ్చానని తెలిపారు. భవనం పూర్తయిన అనంతరం తనకు రావాల్సిన రెండు అంతస్తులను ఇవ్వకుండా తిరిగి తనపై హత్యాయత్నానికి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. మూడో పట్టణ పోలీస్‌స్టేషన్లో రెండుసార్లు ఫిర్యాదు చేశానని, పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఈనెల 9వ తేదీన నగర పోలీస్ కమిషనర్‌కు పిజిఆర్ఎస్ ద్వారా ఫిర్యాదు చేశానని, విచారణ జరుగుతున్న సమయంలో తనను వారి ఆఫీసుకు, ఇంటికి రావాలని ఒత్తిడి చేస్తూ మనుషుల్ని పంపించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పోలీసులు స్పందించి గిరీష్‌బాబుపై చర్యలు చేపట్టాలని, తనకు రావాల్సిన ఇంటిని న్యాయబద్ధంగా అప్పగించే చర్యలు చేపట్టాలని బాధితుడు కోరాడు. పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ ముద్దాయి తరుపున మాట్లాడుతున్నారని, తనకు ప్రాణ రక్షణ కల్పించాలని ఆయన కోరారు. 75 ఏళ్ల వయస్సులో వృద్ధాప్యంతో బాధపడుతున్న తనకు పోషణ కూడా ఇబ్బందిగా ఉందని, పోలీసులు చర్యలు చేపట్టి తనకు న్యాయం చేయాలని కోరాడు.

ఎంవిపి సిఐగా ప్రసాద్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎంవిపి పోలీసుస్టేషన్ సిఐగా కెవిఎన్‌వి.ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఈ స్టేషన్‌లో పనిచేసిన జె.మురళీని విశాఖపట్నం రేంజ్ విఆర్‌కు సరెండర్ చేసారు. ప్రసాద్ గతంలో ఈ పోలీస్‌స్టేషన్లో పని చేశారు.

వాహనమిత్ర దరఖాస్తుపై అవగాహన

ప్రజాశక్తి- వేపగుంట : కూటమి ప్రభుత్వం ఆటో, క్యాబ్ డ్రైవర్లకు దసరా కానుకగా ప్రకటించిన వాహనమిత్ర పథకం దరఖాస్తుకు బుధవారం పురుషోత్తపురం సచివాలయంలో అవగాహన కల్పించారు. వాహన మిత్ర పథకంలో అర్హులైన ప్రతి ఆటోడ్రైవర్‌కు ప్రభుత్వం రూ.15వేలు ఆర్థికసాయం అందజేస్తుందన్నారు.ఈసందర్భంగా సిఎం చంద్ర బాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.కార్యక్రమంలో పెందుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉరికిటి గోవింద్, తెలుగు యువత అధ్యక్షులు కోటిబని శ్రీను యాదవ్, జగన్మోహన్, పాత్రుడు, రాజు, కోరాడ శ్రీను, దాకారపు ఈశ్వరరావు, జోగ ఎర్రి రాజు, యలమంచిలి సంతోష్, సచివాలయం సిబ్బంది, కూటమి నేతలు, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

పిఆర్‌టియు నూతన కార్యవర్గం

ప్రజాశక్తి- వేపగుంట : పెందుర్తి మండలం ఆర్ఆర్. వెంకటాపురం మండల పరిషత్ పాఠశాలలో బుధవారం పిఆర్‌టియు నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది.యూనియన్ జిల్లా అధ్యక్షులు మద్దు శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డు మహేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గారావు సమక్షంలో నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. యూనియన్ మండల కార్యదర్శిగా పనిచేసిన సుధాకర్ బదిలీతో ఖాళీ అయిన ఆ స్థానంతోపాటు నూతన మండల కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా బొమ్మాళి భాగ్యవతి, ప్రధాన కార్యదర్శిగా వేచలపు వెంకటరమణమూర్తితోపాటు మిగతా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు..

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, తాళ్ళ వలస 11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో రూరల్ ఫీడర్‌లో మరమ్మతులు, నిర్వహణ దృష్ట్యా ఈ నెల 19న శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్, మూడవ జోన్ ఆపరేషన్ విభాగం ఇఇ బి సింహాచలంనాయుడు బుధవారం ప్రకటనలో తెలిపారు తాళ్ళవలస, రాయినిపేట, ఎరుసుపేట, లెజెండ్ లేఅవుట్, ఒసుంపేట, హాసిని లేఅవుట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

20న విద్యుత్‌కు అంతరాయం

ఆనందపురం : ఆనందపురం సబ్‌స్టేషన్ పరిధిలోని బోని 11కెవి ఫీడర్‌లో విద్యుత్‌లైన్ల నిర్వహణ దృష్ట్యా ఈనెల 20న శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2.గంటల వరకు ఆనందపురం, బి.పి. కల్లాలు, పెద్దిపాలెం, పొడుగు పాలెం, కుసులవాడ, దండువారి కల్లాలు, గొట్టిపల్లి, ఏనుగుపాలెం, రేగానిగూడెం, రామినేనిపేట, చిన్నయ్యపాలెం, జగన్నాథపురం, వెంకటాపురం, చందక తదితర ప్రాంతాల్లో గృహ, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఎఇఇ అప్పలనాయుడు తెలిపారు.

65మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి - ఆనందపురం : ప్రధాని మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని దుక్కవానిపాలెం గ్రామంలో ఓఎన్‌డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో, శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత మెగాకంటి వైద్య శిబిరం నిర్వహించారు. 65 మందికి కంటి పరీక్షలు చేసి, 15మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసి, నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. బిజెపి మండల ఉపాధ్యక్షుడు అద్దూరి సురేష్, ఒఎన్‌డి సంస్థ వ్యవస్థాపకుడు శివ దలాయి, క్యాంపు కోఆర్డినేటర్ వై.రాజు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రులకు ముహూర్తపు రాట

ప్రజాశక్తి -ఆనందపురం మండలంలోని లొడగలవానిపాలెం గ్రామంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలకు సర్పంచ్ లొడగల రాజేశ్వరి, రమణ దంపతుల ఆధ్వర్యంలో బుధవారం ముహూర్తపు రాట వేశారు. కార్యక్రమంలో బమ్మిడి శ్రీ తారక్, మాజీ ఎంపిటిసి లొడగల వెంకటరావు, గొలగాని వెంకట అప్పారావు, లొడగల సురేష్‌కుమార్, లొడగల అప్పల నాయుడు, లొడగల సన్యాసిరావు, ముద్దాడ సన్యాసిరావు, అలబోయిన రమణ, గొలగాని సాయి, నమ్మి శ్రీను, పోలిపల్లి అప్పారావు, బూరి కనకరాజు, అలబోయిన రాము పాల్గొన్నారు.

ఔషధ సక్రమ వినియోగంపై అవగాహన



కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్న జిమ్సర్ ప్రతినిధులు

ప్రజాశక్తి-మధురవాడ : భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబసంక్షేమ మంత్రిత్వ శాఖ పిలుపు మేరకు జాతీయ ఔషధ భద్రత పర్యవేక్షణ వారోత్సవాలను గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని జిమ్సర్ ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.గీతాంజలి ప్రారంభించారు. కార్యక్రమంలో జిమ్సర్ డీన్ డాక్టర్ ఎస్.పి.రావు, ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ తులసి మాధురి, ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ ఎ.శ్యామ్‌కుమార్, డాక్టర్ ఎన్.సింధూర, డాక్టర్ కె.వి.పూజిత, డాక్టర్ ఎ.కృష్ణసాయి, డాక్టర్ జి.వినీల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఔషధాల వినియోగంలో ఏవైనా సైడ్ఎఫెక్ట్ వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఔషధ దుష్పరిణామాల గుర్తింపుపై సమాజంలో చైతన్యం తీసుకురావడానికి, ప్రజారోగ్య భద్రతకు కేంద్ర ఆరోగ్య, కుటుంబసంక్షేమ మంత్రిత్వ శాఖ అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. వారోత్సవాలలో భాగంగా జిమ్సర్ వైద్య విద్యార్థుల ఆధ్వర్యంలో భీమిలి సామాజిక వైద్య కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేశారు.

'వయో వందనం' పథకాన్ని వినియోగించుకోండి



ఉపకరణాలను పంపిణీ చేస్తున్న ఎడి కవిత, తదితరులు

ప్రజాశక్తి -పద్మనాభం : కేంద్ర ప్రభుత్వ వయో వందన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ వయోవృద్ధులు, వికలాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.కవిత పిలుపునిచ్చారు. బుధవారం గురుదేవా చారిటబుల్ ట్రస్ట్, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, గాయత్రి వెల్ఫేర్ కల్చర్ అకాడమీ, బిజెపి పద్మనాభం మండలశాఖ ఆధ్వర్యంలో గోస్తని హైస్కూల్ ఆవరణలో వికలాంగులకు కృత్రిమ అవయవాలు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, చంకకర్రలు, ఇతర ఉపకరణాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎడి కవిత మాట్లాడుతూ, వికలాంగుల సంక్షేమానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. 90శాతం వైకల్యం కలిగి, మంచంపైనుంచి లేవలేని వారికి నెలసరి రూ.15వేలు వికలాంగ పింఛను ఇతర వికలాంగులకు రూ.ఆరువేలు పింఛను అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బిజెపి. మండల ఇన్‌ఛార్జి రూపాకుల రవికుమార్, టినాగమణి, మచ్చ సోమేష్, సిరిపురపు వెంకట్రావు, హంస మహేష్, కళింగపట్నపు అప్పన్న, చొప్ప కృష్ణ, మరగాడ గౌరీరెడ్డి, ప ల్లా భరత్ కుమార్, కె.శ్రీనివాస్, గురు దేవా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు సబిత, సుకన్య, బర్ల బాలాజీ పాల్గొన్నారు.

అమెజాన్ గ్రేట్ ఇండియా ఫెస్టివల్‌లో భారీ డిస్కౌంట్లు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: ఈ నెల 23న ప్రారంభం కానున్న అమెజాన్ గ్రేట్ ఇండియా ఫెస్టివల్‌లో గృహోపకరణాల ఉత్పత్తులపై 80 శాతం వరకు తగ్గింపు అందిస్తున్నామని సంస్థ ప్రతినిధి నివాస్ తెలిపారు బుధవారం విశాఖలో ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతూ స్పోర్ట్స్‌సామాగ్రిపై 70 శాతం, ఈవీ ద్విచక్ర వాహనాలపై రూ.26 వేల వరకు, వంట సామగ్రి, డైనింగ్ ఉత్పత్తులపై 50 శాతం, ఫర్నిచర్ హోమ్‌డెకార్ వస్తువులపై 45 శాతం వరకు తగ్గింపు ఉంటుందన్నారు. నోకాస్ట్ ఇఎంఐ సౌకర్యంతో ఐసిఐసిఐ, ఎస్‌బిఐ, హెచ్‌డిఎఫ్‌సి క్రెడిట్ కార్డు ద్వారా కొనుగోలు చేసే వారికి రూ.17,500 వరకు ప్రయోజ నాలు చేకూరతాయన్నారు. ఈ సేల్ ప్రైమ్ సభ్యులకు 24గంటలు ముందుగానే అందుబాటులో ఉంటుందన్నారు.

ఆన్‌లైన్ మోసాల అదుపునకు '14సి'తో ఒప్పందం

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: రానున్న పండగ సీజన్ నేపథ్యంలో ఆన్‌లైన్‌లో ఉత్తేజభరితమైన డీల్స్, భారీ ఎంపికలు, అంతులేని షాపింగ్ అవకాశాలను తెచ్చిందని, అదే సందర్భంలో నకిలీ ఆఫర్లు, తప్పుదారి పట్టించే మెసేజ్‌లు కూడా ఉన్నాయని కస్టమర్లు అప్రమత్తంగా ఉండవలసిందిగా అమెజాన్ పబ్లిక్ రిలేషన్స్, కమ్యూనికేషన్స్ విభాగ డైరెక్టర్ అశ్విని సమ్రాజ్ తెలిపారు. హోం వ్యవహారాల శాఖ ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌తో అమెజాన్ సంస్థ భాగస్వామ్యం చేసుకుందన్నారు. అమెజాన్ నుంచి వచ్చినట్లుగా వివరించే అనుమానాస్పద లింక్ లేదా ఏదైనా ఇతర షాపింగ్ వెబ్‌సైట్ మెసేజ్‌లను క్లిక్ చేయడానికి, భాగస్వామ్యం చేయడానికి, చెల్లించడానికి ముందు జాగ్రత్తగా ఉండవలసిందిగా కోరారు.

'స్వచ్ఛతా హీ సేవ' ప్రచారం ప్రారంభం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: దేశవ్యాప్తంగా స్వచ్ఛభారత్ మిషన్ కింద 9వ ఎడిషన్ స్వచ్ఛతా హీ సేవ-2025 బుధవారం ప్రారంభమై, వచ్చేనెల 2 వరకు కొనసాగనుంది. వాల్తేర్ డివిజన్ రైల్వే కాలనీలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ డ్రైవ్‌లో వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రామాట్లాడుతూ ఇంటింటికీ అవగాహన ప్రచారాలు, పెద్దఎత్తున పరిశుభ్రత డ్రైవ్‌లు, స్వచ్ఛభారత్ మిషన్‌తో అనుసంధానించబడిన పోటీలు, స్వచ్ఛ ఆహార కార్యక్రమాలు ఇందులో ఉన్నాయన్నారు.

కార్యక్రమంలో ఎడిఆర్ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్‌సాహూ ఎడిఆర్ఎం (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) శాంతారామ్ సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ ఎన్విరాన్‌మెంట్ అండ్ హౌస్ కీపింగ్ మేనేజ్‌మెంట్ విభాగం అధిపతి ప్రవీణ్‌భాటి, వివిధ విభాగాల బ్రాంచ్ అధికారులు రైల్వే అధికారులు సిబ్బంది కాలనీ నివాసితులు పాల్గొన్నారు. పాల్గొన్న వారందరితో డిఆర్ఎం లలిత్ బోహ్రా స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు.

పోర్ట్ అథారిటీలో స్వచ్ఛత పక్వాడా

2024-25 సంవత్సరానికి స్వచ్ఛత పక్వాడాలో దేశంలోనే నంబర్ వన్ పోర్ట్ గా నిలిచిన విశాఖపట్నం పోర్ట్ అథారిటీలో స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా, కేంద్ర నౌక జల రవాణా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు, ఈ సంవత్సరం 'స్వచ్ఛోత్సవ్' అనే థీమ్‌తో సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2, వరకు స్వచ్ఛత పక్వాడా నిర్వహిస్తున్నారు. బుధవారం అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయ భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియం జరిగిన కార్యక్రమంలో విపిఎ ఉపాధ్యక్షుడు దుర్గేష్ కుమార్ దుబే, అన్ని విభాగాధిపతులు ఉద్యోగులతో కలిసి స్వచ్ఛతప్రతిజ్ఞ చేశారు. అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వేధింపులు తాళలేక
వెలుగు ఆర్‌పి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-సీతమ్మధార : టిడిపి మహిళా అధ్యక్షురాలి భర్త వేధింపులు భరించలేక ఒక మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన అక్కయ్యపాలెం ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాలివీ. అక్కయ్యపాలెం సంఘం ఆఫీస్ లోపల నివాసముంటున్న ఆర్‌పి శరగడం అలివేణి బుధవారం మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తన చావుకు టిడిపి 43వ వార్డు అధ్యక్షురాలు బొడ్డేటి శ్రీదేవి భర్త బొడ్డేటి మోహన్ వేధింపులే కారణమని సూసైడ్ నోటులో పేర్కొంది. మాత్రలు మింగడంతో అస్వస్థతకు గురైన అలివేణికి కుటుంబసభ్యులు స్థానిక కళా ఆసుపత్రికి చికిత్సకు తరలించారు. సకాలంలో వైద్యసేవలు అందడంతో ఆమె ప్రాణాపాయ స్థితి తప్పిందని వైద్యులు చెప్పారని కుటుంబసభ్యులు తెలిపారు. కాగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అలివేణిని పలువురు వెలుగు ఆర్‌పిలు పరామర్శించారు.

గంజాయి కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - కొత్తకోట: గత కొన్నేళ్లుగా పోలీసుల కళ్ళు కప్పి తిరుగుతున్న గంజాయి నిందితుడిని అరెస్ట్ చేశామని కొత్తకోట సీఐ కోటేశ్వరరావు చెప్పారు. బుధవారం సాయంత్రం స్థానిక విలేకరులకు అందించిన వివరాలివి. 2017లో గంజాయి అక్రమ రవాణా, కొనుగోలుకు సంబంధించి నేరాలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న కొరపాకుల కుమార స్వామిపై ప్రత్యేక బృదాలతో నిఘా పెట్టారు. టెక్నికల్ సమాచారం ఆధారంగా నిందితుడు కుమార స్వామి హైదరాబాద్ చైతన్య పురి పోలీసుస్టేషన్ పరిధిలో నివాసముంటూ పెట్రోల్ బంక్ లో పనిచేస్తున్నాడు. కొత్తకోట ఎస్సై శ్రీనివాస్ బృందం కుమార స్వామి ని అదుపులో కి తీసుకొని కొత్తకోట తీసుకు వచ్చినట్లు సీఐ తెలిపారు. కస్టడీ కి తీసుకొని మరిన్ని వివరాలు రాబడతామని సీఐ వివరించారు. ఈకార్యక్రమంలో కొత్తకోట ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మైనర్ బాలికపై ప్రేమ పేరుతో మోసం చేసి అత్యాచారం చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు నర్సీపట్నం డిఎస్పి పోతురెడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

బుధవారం అడ్డరోడ్డు సర్కిల్ కార్యాలయంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎస్ రాయవరం మండలం రాయవరం గ్రామానికి చెందిన సింగన శ్రీను (21) మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసం చేసి ఆమె అత్యాచారం చేసినట్లు తెలిపారు. బాధితురాలు ఇచ్చిన పిర్యాదు మేరకు పోక్సో కేసుగా నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్టు పేర్కొన్నారు. దర్యాప్తులో నక్కపల్లి సిఐ ఎల్ రామకృష్ణ, స్థానిక యస్ఐ విభీషణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మోడీ జన్మదినాన సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం : భీమిలి సిహెచ్‌సిలో రోగులకు ఆయుర్వేద వైద్యులు ఎస్ వాయునందనరావు అధ్వర్యంలో పండ్లు, రొట్టెలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం ఫణి కుమార్, న్యాయవాది మంజుల, బిజెపి నేత పల్లా భరత్‌కుమార్, ఎం రామకృష్ణ పంపిణీ చేశారు.

నర్సీపట్నం ఏరియా హాస్పిటల్‌లో బీజేపీ నాయకులు పాకలపాటి అరవింద్ రాజు, వెలగా జగన్నాధ్, కాళ్ల సుబ్బారావు, చిందాడ సూరేష్, చుక్కల రాంబాబు, నున్న నాగేశ్వరావు, నక్కా సత్యనారాయణ, నూకినాయుడులు పాల్గొని రక్తదానం చేశారు.

రైతులకు అందుబాటులో యూరియా

-జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు

ప్రజాశక్తి: రావికమతం:మండలంలో పలు పిఎసిఎస్‌లు, రైతు సేవ కేంద్రాల్లో రైతులకు యూరియా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయ అధికారి బి. మోహన్ రావు తెలిపారు. రావికమతం రైతు సేవా కేంద్రాన్ని సందర్శించిన ఆయన పత్రిక విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో రావికమతం పిఎసిఎస్‌కు 24 టన్నులు, మేడివాడ రైతు సేవా కేంద్రానికి 12 టన్నులు, గుడివాడ రైతు సేవా కేంద్రానికి 12 టన్నులు, త్రినేత్ర ఆగ్రో ఏజెన్సీ ప్రైవేట్ డీలర్ కొత్తకోటకు 20.25 టన్నుల యూరియా మరో రెండు రోజుల్లో అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. యూరియా గురించి రైతుల ఏ ఒక్కరు అధైర్యపడవలసిన అవసరం లేదని ఆయన అన్నారు.

ఖైదీల సౌకర్యాల పరిశీలన



రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న సన్యాసినాయుడు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు బుధవారం సందర్శించారు. కారాగారంలో ఉన్న సౌకర్యాలు, ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం, ఖైదీల పునరావాసానికి చేపట్టిన చర్యలు తదితర విషయాలను జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దీనదయాల్‌పురంలోని ప్రభుత్వ బాలుర, ప్రత్యేక గృహం, జువనైల్ జస్టిస్ బోర్డు, ప్రభుత్వ పరిశీలన గృహాలను సందర్శించారు. ఆయా గృహాలలో బాలురకు కల్పించిన సౌకర్యాలు, ఆహారం, వైద్య సేవలు, విద్యా సౌకర్యాలను పరిశీలించారు. బాలల పరిరక్షణ, వారికి చట్టపరంగా లభించే న్యాయ సహాయంపై వివరించారు. కార్యక్రమాల్లో కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి ఎం.మహేష్ బాబు, బాలుర గృహాల పర్యవేక్షణాధికారులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర పి4లో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో స్వర్ణాంధ్ర విజన్ 2047 నూతన కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ, జోనల్ కమిషనర్ రాము, జివిఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు, స్వర్ణాంధ్ర పీపుల్ అసోసియేషన్ స్టాఫ్, కూటమి పార్టీ నేతలు సనపల వరప్రసాద్, రామకృష్ణ, సనపల కీర్తి, లోహిత్ రావు, పద్మజ, రామకృష్ణ బంగార్రాజు, జాన్, తాతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వర్ణాంధ్ర పీ4లో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

కేంద్ర బీమా పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని చిన్నాపురం గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ ఎ.ఐ. బషీర్, ఎస్‌బిఐ డిజిఎం రాహుల్ శంక్రిత్యా, ఆర్ఎం అభిషేక్ కుమార్, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్, సిఎంఎఫ్ఐ, మేనేజర్ వేణుగోపాల్ రాఘవేంద్ర, రెడ్డిపల్లి శాఖ మేనేజర్ వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూలై ఒకటి నుంచి ఈనెలాఖరు వరకు గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఇకెవైసి, నామినీ, సైబర్ క్రైమ్ లపై అవగాహన కల్పించారు. జన్ ధన్ ఖాతాల నవీకరణ దిశగా ఎస్‌బిఐ చర్యలు తీసుకుంటోందని, గ్రామీణ ప్రాంతాలలో ఎస్‌బిఐ సేవలు మరింత విస్తృతం చేస్తామన్నారు.

ఇద్దరు రక్తహీనత పిల్లల దత్తత



దత్తత ప్రకటిస్తున్న మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి

ప్రజాశక్తి-పద్మనాభం.: మండలంలోని అనంతవరం, గద్దపేట అంగన్వాడీ కేంద్రాల్లో రక్తహీనతతో బాధపడుతూ, తక్కువ బరువున్న ఇద్దరు పిల్లలను మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి దత్తత తీసుకున్నారు .బుధవారం రేవిడి పిహెచ్‌సి వద్ద స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో గెద్దపేటకు చెందిన కళ్లేపల్లి ప్రీతి, అనంతవరానికి చెందిన కాటా వేదాన్షిలను దత్తత తీసుకున్నట్లు అంగన్వాడీ సూపర్‌వైజర్ పార్వతి, బేగం వెల్లడించారు.

అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాక్‌థాన్‌లో

విజ్ఞాన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఉక్కునగరం : దువ్వాడలోని విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకళాశాలకు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగ విద్యార్థులు విశిష్ట విజయం సాధించారు. సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఎండ్ స్టార్టప్స్ ఆధ్వర్యంలో ఈనెల 10న అమరావతి క్వాంటం వ్యాలీలో జరిగిన హ్యాకథాన్ సెమీఫైనల్ రౌండ్‌లో విజయం సాధించారు. ఎపి ఉన్నతవిద్యామండలి సహకారంతో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల రీజనల్ సెంటర్ ఆధ్వర్యంలో గాయత్రి విద్యా పరిషత్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు.



ప్రశంసాపత్రాలను అందుకుంటున్న విజ్ఞాన్ విద్యార్థులు

ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ జె. సుధాకర్ మాట్లాడుతూ, దేశంలోనే మొట్టమొదటి క్వాంటం టెక్నాలజీ హబ్‌గా రూపుదిద్దుకుంటున్న అమరావతి క్వాంటం వ్యాలీలో క్వాంటం ఇన్నోవేషన్‌లో ప్రతిభను చూపడం ద్వారా కళాశాలకే కాకుండా రాష్ట్రానికి గర్వకారణంగా విజ్ఞాన్ విద్యార్థులు నిలిచారని హర్షం వ్యక్తం చేశారు. ఎఐ క్వాంటం కంప్యూటర్ రంగంలో ముందడుగు వేసి భవిష్యత్తు సాంకేతిక అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను రెక్టార్ డాక్టర్ వి. మధుసూదనరావు, ఫ్యాకల్టీ మెంటార్స్, విసిఐఎస్ హెడ్ డాక్టర్ ఎ.సంపత్ దక్షిణామూర్తి, ఇడి సెల్ ఇన్‌ఛార్జి డాక్టర్ బి.ఓంకార్, డాక్టర్ పి లక్ష్మణ్ అభినందించారు.

మన డబ్బులు- మన లెక్కలు యాప్‌పై అవగాహన



ర్యాలీలో అవగాహన కల్పిస్తున్న డిపిఎం వైదేహి

ప్రజాశక్తి - ఆనందపురం: 'మన డబ్బులు- మన లెక్కలు' యాప్‌పై డ్వాక్రా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. బుధవారం వెలుగు కార్యాలయంలో నిర్వహించిన మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశంలో జిల్లా ప్రాజెక్టు అధికారి వైదేహి మన డబ్బులు, మన లెక్కలు యాప్ ప్రాధాన్యతను వివరించారు. ఈ యాప్ ద్వారా ప్రతి సభ్యురాలు తమ పొదుపులు, అప్పులు, చెల్లింపులు వంటి వివరాలను సులభంగా తెలుసుకోవచ్చునన్నారు. వాయిస్ రికార్డింగ్ రూపంలో కూడా ఈ వివరాలు అందుబాటులో ఉంటాయని లైవ్ డెమో చూపించారు.ఈ సందర్భంగా గత ఏడాది సాధించిన ప్రగతిని సమీక్షించి, రాబోయే సంవత్సరానికి వార్షిక ప్రణాళికను సభలో ఆమోదించారు. మహిళా సంఘాల నిర్వహణ, జీవనోపాధి అవకాశాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, జెండర్ సమానత్వం, ఎంసిపి వంటి అంశాలపై అవగాహనకల్పించారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిపిఎం వైదేహి, డిపిఎం (ఎల్‌హెచ్)సత్యం నాయుడు, ఎపిఎం (హెచ్‌డి) రేణుక, మండల ఎపిఎం ఎస్తేరు రాణి, ఎఫ్‌పిఐ ప్రభ పాల్గొన్నారు

గంభీరంలో స్వచ్ఛత పనుల పరిశీలన

ప్రజాశక్తి- ఆనందపురం : స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2025 రాష్ట్ర అవార్డుకు గంభీరం గ్రామ పంచాయతీ ఎంపికలో భాగంగా స్వచ్ఛత పనుల పరిశీలనకు రాష్ట్ర ప్రతినిధి పి. చిరంజీవి బుధవారం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అవార్డు మార్గదర్శకాల్లోని సూచికల ప్రకారం గ్రామ పంచాయతీలో ఇంటింటి చెత్త సేకరణ, గ్రామశుభ్రత, చెత్త నుండి సంపద తయారీ, రికార్డుల సంరక్షణ వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నివేదిక ఆధారంగా రాష్ట్రస్థాయి అవార్డు ఎంపిక జరగనుందని వెల్లడించారు. తనిఖీలలో భాగంగా గురువారం ఆనందపురం మండలంలోని వేములవలస, పెద్దిపాలెం గ్రామాలు, భీమిలి మండలంలోని తాటితూరు, నగరపాలెం పంచాయతీలను కూడా పరిశీలించనున్నట్లు రాష్ట్ర ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ డాక్టర్ వి. జానకి, డిప్యూటీ ఎంపిడిఓ బి.



చెత్త సేకరణను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రతినిధి చిరంజీవి

సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ వానపల్లి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్ మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం నుంచి వచ్చేనెల ఒకటో తేదీ వరకు నిర్వహించనున్న వివిధ కార్యక్రమాలను అధికారుల సమక్షంలో ప్రారంభించారు

ప్రకృతి వ్యవసాయం సాగు క్షేత్రాల పరిశీలన

ప్రజాశక్తి-పద్మనాభం. మండలంలోని మద్ది, కొవ్వాడ గ్రామాల్లో ప్రకృతి విధానంలో సాగులో ఉన్న వ్యవసాయ క్షేత్రాలను బుధవారం రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ రాయుడు ఆధ్వర్యంలో పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా 365 రోజుల సాగు విధానం, ప్రతిరోజు ఆదాయం వచ్చేలా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఎటిఎం, ఎ గ్రేడ్ మోడల్‌లో వేసిన పంటలు, వాటి మార్కెటింగ్, వచ్చే ఆదాయం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో రీజనల్ ఆఫీసర్ ప్రకాష్, విశాఖపట్నం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎ.మోహనరావు, ఎన్ఎఫ్ఎ బాలమణి, ఉష, పైడితల్లి, రమణమ్మ, కుమారి, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న రైతు సాధికార సంస్థ అధికారులు

19న యుటిఎఫ్ రణభేరి బైక్ జాతా

ప్రజాశక్తి -పద్మనాభం.: ఆనందపురం మండలంలో ఈనెల 19న నిర్వహించనున్న యుటిఎఫ్ రణభేరి బైక్‌జాతాను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం రామకృష్ణ, పద్మనాభం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎంవి రెడ్డి, సంజయ్ కుమార్ కోరారు. ఉపాధ్యాయులకు సంబంధించి 12వ పిఆర్‌సి ప్రకటన, పెండింగ్ డిఎల చెల్లింపు, బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయింపు, యాప్‌ల భారం తగ్గింపు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ రణభేరి జాతా నిర్వహిస్తోందన్నారు. అధిక సంఖ్యలో యుటిఎఫ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొని బైక్‌జాతా విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- సీతమ్మధార. : ఎపిఇపిడిసిఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి విశాఖపట్నం జోన్-1 డివిజన్ పరిధిలోని పెదవాల్తేరులో ఈనెల 18న గురువారం సిజిఆర్ఎఫ్ క్యాంపు కోర్టు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఛైర్‌పర్సన్, విశ్రాంత జడ్జి బి సత్యనారాయణ తెలిపారు. పెదవాల్తేరు సెక్షన్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్దరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలాగే సీతమ్మధారలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలోని సిజిఆర్ఎఫ్ కార్యాలయానికి కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వినియోగదారుల సమస్యలపై విచారణ జరిపి తగిన న్యాయం చేస్తామన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించవచ్చని సూచించారు. సదస్సులో చైర్ పర్సన్ బి సత్యనారాయణతో పాటుకమిటీ సభ్యులు ఎస్ రాజాబాబు, ఎస్ సుబ్బారావు, ఎన్ మురళీకృష్ణ పాల్గొంటారు.

26న జివిఎంసి షాపుల వేలం

ప్రజాశక్తి- సీతమ్మధార/ ఎంవిపి కాలనీ : జివిఎంసి మూడవ జోన్, ఆశీలు మెట్ట పరిధిలోని వివిధ వాణిజ్య సముదాయాల్లో ఖాళీగా వున్న షాపులు, కళ్యాణమండపాల లీజ్‌కు ఈ నెల 26న ఉదయం 11 గంటలకు ఆశీలుమెట్ట కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మూడవ జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ బుధవారం ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల కాలపరిమితికి గుత్త ఇచ్చేందుకు బహిరంగ వేలం జరుగుతుందని, ఆసక్తి గల పాటదారులు పూర్తి వివరాలకు 3వ జోనల్ కమిషనర్ కార్యాలయంలో పని వేళల్లో పర్యవేక్షకులను సంప్రదించాలని జెడ్‌సి సూచించారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం



లెంక సురేష్

ప్రజాశక్తి -ఆనందపురం : విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో అభిమానులను సమన్వయం చేసుకుంటూ జూనియర్ ఎన్‌టిఆర్ అభిమాన సంఘం టీమ్ తారక్ ట్రస్ట్ సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టనున్నట్లు జోన్-1 నిర్వాహకుడిగా నియమితులైన ఆనందపురం మండలం మిందివానిపాలెం గ్రామానికి చెందిన లెంక సురేష్ తెలిపారు. సంఘం తరపున నియామక పత్రం అందుకున్న సురేష్ మాట్లాడుతూ, ఇప్పటి వరకు ట్రస్ట్‌జిల్లా కోఆర్డినేటర్‌గా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించానని, ఇప్పుడు జోన్-1 నిర్వాహకుడిగా తన బాధ్యత పెరిగిందన్నారు. సమాజంలో పేదవారికి, సాయం అవసరమైన వారికి అండగా నిలిచి, టీమ్ తారక్ ట్రస్ట్ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళతానన్నారు.

క్షతగాత్రుడికి పరామర్శ

ప్రజాశక్తి- వేపగుంట : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కిమ్స్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న సబ్బవరం మండలం వంగలి గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు కోట్ని నాయుడును పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పరామర్శించారు. కార్యక్రమంలో గవర రాజు,విద్యార్థి విభాగం అధ్యక్షుడు బొడ్డపల్లి హేమంత్‌కుమార్, ఉగ్గిన నాగార్జునఉన్నారు.

యూరియా రాయితీ పేరుతో రైతులను మోసగిస్తున్న కూటమి ప్రభుత్వం

సిపిఎం నేతలు కోటేశ్వరరావు, వెంకన్న

ప్రజాశక్తి-అనకాపల్లి, దేవరాపల్లి

రైతులకు ఎరువుల కొరత, ధరల పెరుగుదలతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న వేళ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఎరువుల వాడకం తగ్గిస్తే నగదు ప్రోత్సాహకం ఇస్తామని చేసిన ప్రకటన కేవలం మోసపూరితమైందే తప్ప రైతులకు ఉపయోగం చేకూర్చేది కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న బుధవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో యూరియాతో సహా అన్ని రకాల ఎరువుల సరఫరా కొరత ఉందని, కేంద్రం నుంచి సరిపడా ఎరువులు రాకపోవడం, రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోనే ఈ సంక్షోభం వచ్చిందని తెలిపారు. ఈ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే బస్తాకు రూ.800 రాయితీలు ఇస్తామని రైతులను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. పంటల దిగుబడి తగ్గకుండా వుండేందుకు అవసరమైనంత ఎరువులను సరఫరా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కాని ఎరువుల సబ్సిడీని తగ్గించుకోవాలన్న కక్కుర్తితో కేంద్ర బిజెపి ప్రభుత్వం ఈ ఏడాది రాష్ట్రాలకు కేటాయింపు తగ్గించిందని మండిపడ్డారు. టిడిపి కూటమి ప్రభుత్వం దానికి తోడవ్వడం, మిగిలిన రాష్ట్రాలు పది శాతం తగ్గించుకోగా ఆంధ్రప్రదేశ్ 25 శాతం కోతకు అంగీకరించడం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్రానికి వచ్చిన ఎరువులను కూడా రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల మద్దతుతో వ్యాపారులు బ్లాక్ మార్కెట్‌కు తరలించారని ఆరోపించారు. క్యాన్సర్ రావడానికి అనేక కారణాలుండగా యూరియా వాడకంతో వస్తుందని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవని, ఏ వైద్య పరిశోధనా సంస్థ, శాస్త్రవేత్త ఈ విషయం చెప్పారో ముఖ్యమంత్రి వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అదే నిజమైతే ఇంత కాలం ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఎరువులకూ ప్రభుత్వాలు నగదు బదిలీ విధానాన్ని తెచ్చే ప్రమాదం పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయాభివృద్ధికి, ఆహార ధాన్యాల ఉత్పత్తికి కీలకమైన ఎరువులను అవసరం మేరకు సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఐద్వా నేతలు, మహిళలు

టిడ్కో కాలనీలో తాగునీటి బోర్లు వేయాలి

ప్రజాశక్తి-పరవాడ : టిడ్కో కాలనీలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో బుధవారం గోర్లివానిపాలెం సచివాలయం సెక్రటరీకి వినతిపత్రం సమర్పించారు. కాలనీలో జీవీఎంసీ ద్వారా వచ్చే నీరు సరిగా రావడం లేదని, వచ్చినా నీటి నాణ్యత దారుణంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. బురదతో కలిసిన నీరు తాగడం వల్ల ప్రజలు విషజ్వరాలు, కీళ్ల నొప్పులు, ఇతర వ్యాధులతో బాధపతున్నారని వాపోయారు. ఈ కాలనీలో బోర్ల కోసం గతంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు వినతిపత్రం ఇచ్చినట్లు చెప్పారు. ఆయన అధికారులను ఆదేశించగా, స్థలాన్ని పరిశీలించారని, కాని తమ పరిధి కాదంటూ ఆర్డబ్ల్యూఎస్ పరిధిలోకి వస్తుందని చెప్పారని పేర్కొన్నారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్తే వారు కూడా తమ పరిధిలోకి రాదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, టిడ్కో కాలనీ అధ్యక్షురాలు మన్యాల బంగారమ్మ, సెక్రటరీ తుంపాల అన్నపూర్ణ, గొంప సీత, కే.లక్ష్మి, వి.సరోజినీ, ఆర్. రవణమ్మ, అస్మత్ బేగం, సీతమ్మ, అబద్ధ, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-వడ్డాది : వి.మాడుగుల మండలంలో గొర్రెలు మేకలు పెంపకందారుడు కోళ్ల వరహాలు నాయుడుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని గొర్రెల పెంపకం దార్ల సహకార సంఘం చైర్మన్ గంట శ్రీరామ్ డిమాండ్ చేశారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో బుధవారం కర్ర పత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వి.మాడుగుల మండలం ఎం.కృష్ణాపురం గ్రామంలో కోళ్ల వరహాల నాయుడును అదే గ్రామానికి చెందిన సర్వేయర్‌గా పనిచేస్తున్న నీటిపల్లి రాము, ఆయన బంధువులు నీటిపల్లి నాయుడు, నీటిపల్లి రాజారావు దాడి చేసి గాయిపర్చారని తెలిపారు. దీంతో వరహాల నాయుడు ఆరు రోజులుగా అనకాపల్లి ఎన్‌టిఆర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడన్నారు. ఇప్పటికైన నిందితులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి, వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈనెల 19న మాడుగుల తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వడ్డాది సొసైటీ అధ్యక్షులు మాజీ సర్పంచ్ మొల్లి అప్పారావు, కోళ్ల రాజుబాబు, మొల్లి గణేష్, ముచ్చల రాజు, మొల్లి శివ, మొల్లి శ్రీను, ముచ్చల సోము నాయుడు, పల్లా వెంట అప్పారావు, మొల్లి కిత్తయ్య, ముచ్చల సన్యాసిరావు, కోళ్ళ గణేష్, పల్లా స్వామి, పల్లా సతేష్ పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో నష్టపోతున్న ఆటో కార్మికులందరూ ఆదుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. మండలంలో కొండకర్ల, అచ్చుతాపురం ప్రాంతాలలో బుధవారం ఆటో కార్మికులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన మిత్ర ద్వారా ఏడాదికి రూ.30వేలు భృతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, యూనియన్ నాయకులు దమ్ము చండీ, రాజు, కర్రి నాయుడు, శ్రీను గోవిందు, చిట్టి రంగారావు పాల్గొన్నారు.

రైతులకు ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి-కోటవురట్ల : స్థానిక పిఎసిఎస్ వద్ద వద్ద సంఘ అధ్యక్షులు జనార్ధన్ బుధవారం రైతులకు ఎరువుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు లింగన్న నాయుడు, ఎంపీటీసీ సభ్యులు సూర్యరావు, రాజుపేట సర్పంచి వెంకటరమణ, నాయకులు జానకి శ్రీను, సుంకర బాబ్జి, చిటికెల సత్యనారాయణ, తిరుమలరావు, యేసుబాబు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసిపి కార్యకర్తలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో బుధవారం హరిపాలెం గ్రామానికి చెందిన 200 మంది వైసిపి కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. న్యాయవాది శరగడం అప్పలనాయుడు, ఎస్ ప్రసాద్, మత్తుర్తి శ్రీనివాసరావు, కర్రి వీరు నాయుడు, సరగడము ఈశ్వరరావు వారి అనుచరులతో చేరారు. వారికి ఎమ్మెల్యే విజయ్ కుమార్ కండువాలు కప్పి జనసేన పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. శరగడము జగ్గారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు శేఖర్

రికగ్నైజ్డ్ స్కూల్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-చోడవరం : విశాఖ రీజియన్ రికగ్నైజ్డ్ స్కూల్స్ అసోసియేషన్ చోడవరం డివిజన్ సమావేశం బుధవారం చోడవరం ఆడమ్స్ స్కూల్‌లో జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ చోడవరం డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బంటు శేఖర్ (రవి కామెంట్, చోడవరం), ఉపాధ్యక్షులుగా రాజాబాబు (రాజా పబ్లిక్ స్కూల్, వీరనారాయణ), ప్రధాన కార్యదర్శిగా రామ పాపారావు (లోటస్ స్కూల్, దేవరపల్లి) సహాయ కార్యదర్శులుగా పట్నాయక్ (నవోదయ స్కూల్, రావికమతం), చోడుగంజి రాంబాబు (శ్రీచైతన్య స్కూల్) కోశాధికారిగా బివిఆర్ఎం రాజు (శ్రీవిద్య స్కూల్, గోవాడ), ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏపీజేఏసీ కన్వీనర్ వివి.రామరాజు, డిఎస్ఎన్.రాజు, శ్రీవిజ్ఞాన్ స్కూల్ చైర్మన్ ఎంఎంకె.రాజు, అనకాపల్లి సిటీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ ప్రకాష్, జిల్లా సెక్రెటరీ విజయ, 60 స్కూల్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైసిపి నుండి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : వైసిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపిపి బోలిశెట్టి గోవిందరావు తన అనుచరులతో కలిసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో ఎస్‌వియల్ కన్వెన్షన్ హాల్‌లో హోంమంత్రి వంగలపూడి అనిత సమక్షంలో టీడీపీలో చేరారు. టిడిపిలో చేరిన వారిలో బొలిశెట్టి గోవిందరావుతో పాటు మాజీ ఎం.పి.పి బొలిశెట్టి సారదాకుమారి, ప్రస్తుత ఎంపిపి కేశిబోయిన వెంకటలక్ష్మి, కొణతాల శ్రీనివాసరావు ముగ్గురు సర్పంచ్‌లు, ఇద్దరు ఎంపీటీసీలు ఉన్నారు. కార్యక్రమంలో ఏపీ పంచాయతీ ఛాంబర్ ఉపాధ్యక్షులు వినోద్ రాజు, నాయకులు అమలకంటి అబద్ధం, నల్లపురాజు వెంకటపతి రాజు, పిఏసిఎస్ అధ్యక్షులు తుంపాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్, వుషు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-పరవాడ : ఉమ్మడి విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగాల రైఫిల్ షూటింగ్, వుషు ఎంపిక పోటీలు సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో బుధవారం నిర్వహించారు. దాదాపు 120 మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వారిలో మెరుగైన ప్రతిభ కనబరిచిన వారినిరాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.ఎమ్.నాయుడు, సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, సీఈఓ కె.నిశాంత్, జి.రాజు పాల్గొన్నారు.

డిఎస్‌సి విజేతలకు సత్కారం

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు చిన్న గొల్లపాలెంకు చెందిన డీఎస్సీ విజేతలు కడుపుకుట్ల లక్ష్మి, పల్లా ధనూషాలను బుధవారం సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పల్ల తాతారావు, మాజీ ఎంపిటిసి పల్లా సన్యాసిరావు, కే వంశీ, పాస్టర్ ఇమ్మానియేల్ అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు మద్దతుగా నిరసన

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో మత్యకారులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు మద్దత్తుగా మండలంలోని గుర్రాజుపేట రైతులు బుధవారం నిరసన తెలిపారు. కొలుకులూరి వెంకటపతి రాజు ఆధ్వర్యంలో ఆ గ్రామ రైతులు తమ భూములను బల్క్ డ్రగ్ కంపెనీలకు ఇవ్వబోమంటూ నినాదాలు చేశారు. గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఎంపిపిపై అవిశ్వాసానికి ముహూర్తం ఖరారు?

- మెజారిటీ ఎంపిటిసిలతో ఊటీలో క్యాంపు
- 24న ఆర్డీఓకు సమర్పించనున్న అవిశ్వాస తీర్మానం

ప్రజాశక్తి - యలమంచిలి : వైసిపికి చెందిన యలమంచిలి ఎంపిపి బోదెపు గోవిందరావుపై ఈ నెల 24న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే దిశగా జనసేన నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇప్పటికే మెజారిటీ ఎంపిటీసీలు ఊటీలోని క్యాంపు కుటీరానికి చేరుకున్నారని తెలిసింది.



ఎంపిపి గోవందరావు

ఆదివారం మధ్యాహ్నానికే క్యాంపు రాజకీయానికి తెరలేపినట్లు సమాచారం. కాకతాళీయంగా ప్రజాశక్తి మండలంలోని ఒక ఎంపిటిసికి ఫోన్ చేయగా ఊటీలో ఉన్నట్లు నిర్ధారించారు. దీన్ని బట్టి గతంలో తన మనోగతం వివరిస్తూ రేగుపాలెం ఎంపిటిసి, వైస్.ఎంపిపి రాజాన శేషగిరిరావు త్వరలోనే మండల పరిషత్ రాజకీయాలో మార్పులు రాబోతున్నాయని ప్రజాశక్తికి చెప్పిన సంగతి రుజు కాబోతోంది. ఎంపిపి పదవి ఆశిస్తున్న రాజాన శేషు ఆధ్వర్యంలోనే ఊటీ క్యాంపు రాజకీయం జరుగుతోందని విశ్వసనీయ వర్గాల కథనం. గతంలో ఎంపిటిసి ఎన్నికల్లో ఏడు ఎంపిటిసి స్థానాలను వైసిపి గెలిచి ఎంపిపి పదవిని కైవసం చేసుకుంది. పులపర్తి నుండి బోదెపు గోవిందరావు (ఎంపిపి), ఏటికొప్పాక (1) నగిరెడ్డి అమ్మాజీ, ఏటికొప్పాక (2) నగిరెడ్డి దేవుడమ్మ (మరణించారు), రేగుపాలెం నుండి రాజాన సూర్య చంద్రశేషగిరిరావు (వైస్ ఎంపిపి), బయ్యవరం పూటకూటి రమగణేష్, కొత్తలి నుండి బర్రె శివలక్ష్మి, జంపాలెం ఎంపిటీసీ శిలపరశెట్టి ఉమా (వైస్ ఎంపిపి-2)గా వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సమీకరణాలు మారాయి. ఎమ్మెల్యే సందరపు విజయకుమార్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో వైస్ ఎంపిపి రాజాన సూర్య చంద్ర శేషగిరిరావు ఆధ్వర్యంలో మెజారిటీ ఎంపిటిసిలు ఊటీ క్యాంపుకు వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. ఈనెల 24వ తేదీన నర్సీపట్నం ఆర్డీఓకి అవిశ్వాస తీర్మానం ఇవ్వనున్నట్లు తెలిసింది.

బురదలో కూరుకుపోయిన వాహనాలు

భారీ వాహనాల రాకపోకలు నిషేధించాలని వేడుకోలు



బిఎన్ రోడ్డులో బురదలో కూరుకుపోయిన భారీ లారీ

ప్రజాశక్తి-వడ్డాది : బీఎన్ రోడ్డులోని బంగారుమెట్ట సమీపంలో రహదారి అధ్వానంగా ఉండడంతో వాహనాలు కూరుకుపోతున్నాయి. మంగళవారం రాత్రి నర్సీపట్నం నుంచి వడ్డాది వైపు వస్తున్న వ్యాన్, గ్రానైట్‌లోడు భారీ లారీ బురదలో కూరుకుపోయాయి. రెండు వాహనాలు ఒకే గోతిలో పక్క పక్కనే కూరుకుపోవడంతో ఇతర వాహనాలు వెళ్లడానికి వీల్లేకుండా పోయింది. దీంతో ట్రాఫిక్ జామ్ అయింది. పలువురు వాహనదారులు వ్యాన్‌ను బయటకు లాగి ట్రాఫిక్ క్లియర్ చేశారు. గ్రానైట్ లారీ బుధవారం ఉదయం కూడా అక్కడే ఉండిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. రావికమతం నుండి స్కూటీపై వడ్డాది వైపు వస్తున్న ఇద్దరు వ్యక్తులు ఈ బురదలో అదుపుతప్పి బోల్తా పడ్డారు. స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అధికారులు జెసిబిని రప్పించి గ్రానైట్ లారీని అతి కష్టం మీద గోతిలో నుంచి బయటికి లాగారు.

ఇటీవల వర్షాలకు ఇక్కడ పెద్ద గొయ్యి ఏర్పడి బురద చేరింది. అనుమతి లేకపోయినా అధిక లోడుతో గ్రానైట్ లారీలు బిఎన్ రోడ్డులో రాత్రి వేళ రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో గోతులు పెద్దవిగా మారుతున్నాయి. లోడుతో వెళుతున్న లారీల నుండి గ్రానైట్ పలకలు గోతుల దగ్గరికి వచ్చేసరికి జారిపోతున్నాయి. గ్రానైట్ లారీలు వచ్చేటప్పుడు వాహనదారులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. బిఎన్ రోడ్డులో అధిక బరువు గ్రానైట్ లారీల రాకపోకలు నిషేధించాలని ప్రజలు కోరుతున్నారు.

టెన్నికాయిట్ పోటీలకు గురుకులం విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులంలో 10వ తరగతి చదువుతున్న పి.సాగర్ టెన్నికాయిట్ విభాగంలో జాతీయ స్థాయి పోటీకి ఎంపికైనట్టు గురుకులం ప్రిన్సిపల్ ఎన్.రామకృష్ణ తెలిపారు. ఈనెల 12, 13 తేదీలలో కోనసీమ జిల్లా మండపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో పి.సాగర్ ఉత్తమ ప్రతిభ ప్రదర్శించడంతో అక్టోబర్ 8 నుండి 12 వరకు ఉత్తరప్రదేశ్ నోయిడాలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన సాగర్‌ను, శిక్షణ ఇచ్చిన పిడి, పిఇటిలు సిఎల్ఎన్ ప్రసాద్, వి.సూర్యనారాయణలను ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ కె.చిరంజీవి, ఉపాధ్యాయులు రాంబాబు అభినందించారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-వడ్డాది : స్మార్ట్ రేషన్ కార్డులతో బహుళ ప్రయోజనాలు కలుగుతాయని స్టేట్ హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్య బాబు అన్నారు. వడ్డాదిలో బుధవారం లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నేతల మంచాల గోవిందా, సయ్యపురెడ్డి మాధవరావు, కోవెల వెంకటరమణ, తలారి శంకర్ పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కలగా సోమేశ్వరరావు, కలగా శ్రీనివాసరావు, కలగా గోవింద, కలగా పార్వతి పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : జివిఎంసి 81వ వార్డులో నీలకంఠరావు వీధి రేషన్ డిపో నెంబర్ 27 పరిధిలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు కూటమి నాయకులు మల్ల గణేష్, మల్ల రామకృష్ణ పంపిణీ చేశారు. కార్యక్రమాములో పీలా రమణారావు, పెతకంశెట్టి జగన్మోహన్రావు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి, కందిపూడి, రాజాం గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దిరెడ్డి మాణిక్యం, ఎంపీటీసీ గొంపా చిన్నబాబు, మాజీ సర్పంచ్ గొంప అప్పారావు, మాజీ ఎంపీటీసీ గోన్నాబత్తుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయం కమిటీ చైర్మన్ పోతల పాత్రు నాయుడు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, టిడిపి నేత పెద్దాడ వెంకటరమణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు పీలా తులసిరాము చేతులమీదుగా స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రమణ, డీలర్ వరలక్ష్మి, సత్యరావు, నాగశ్రీను పాల్గొన్నారు.

ఎఎంసి కాలనీ సమస్యలపై జోనల్ కమిషనర్ ఆరా

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి 83వ డివిజన్ పరిధిలోని ఏఎంసి కాలనీ సమస్యలపై జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి బుధవారం ఆరా తీశారు. అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణకి అనకాపల్లి టిడిపి మీడియా కో-ఆర్డినేటర్ ఎస్.భానుచందర్ (అఖి) ద్వారా ఏఎంసి కాలనీ ప్రజలు వినతిపత్రంపై స్పందించి కాలనీలో పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కావలసిన స్థలాన్ని పరిశీలించారు. సెప్టిక్ టాంకును పూర్తిగా మరమ్మతులు చేబడతామని చెప్పారు. తాగునీటి సమస్యలు, చేపల బజార్ దుర్వాసన సమస్యలపై అడిగి తెలుసుకున్నామని, వీలైనంత తొందరగా ఇక్కడ సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పిట్ల రాజు, బొమ్మల దేవి, కొణతాల గణేష్, షేక్ రియాజ్, నీలపు పండు, గూడుపు పోలారావు, బండి శివ, మిడిపాటీ సాయి జగన్, సోమాదుల సంతోష్, కిరణ్, శేఖర్, ఉమ మహేష్, పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆర్‌డిఎస్ఎస్ బ్రేకర్ పనుల కారణంగా తుమ్మపాల సెక్షన్, 33/11 కె.వి అల్లికానుడిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలలో ఈనెల 19 ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 వరకు 24 గంటల వ్యవసాయ విద్యుత్ సరాఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహరించాలని కసింకోట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

కొత్తూరు సెక్షన్ కార్యాలయ పరిధిలో...

కసింకోట 33/11 కెవి సబ్‌స్టేషన్ మరమ్మతుల, హెచ్‌టి/ ఎల్‌టి లైన్లు కింద ఉన్న చెట్టుకొమ్మలు తొలగింపు కారణంగా కొత్తూరు సెక్షన్ కార్యాలయం పరిధిలోని కొత్తూరు, సత్యనారాయణపురం, మూలపేట, వేట జంగాల పాలెం, సంపతిపురం, కూండ్రం, కుంచంగి రొంగలివానిపాలెం, పిసినికాడ గ్రామాలకు ఈనెల 19 ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు గహ అవసరాల విద్యుత్, వ్యవసాయ విద్యుత్ సరాఫరా నిలిపివేయడం జరుగుతుందని కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సత్యశోధక్ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చోడవరం : మహాత్మా జ్యోతిరావ్ పూలే సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించి 152 ఏళ్లయిన సందర్భంగా దళితవిముక్తి ఆధ్వర్యంలో సత్యశోధక్ మహాసభను నిర్వహిస్తున్నామని దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు బుధవారం కార్యక్రమం వాల్‌పోస్టర్, ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న విజయనగరం జిల్లా కొత్తవలస మండల కేంద్రంలో జరుగుతుందని పేర్కొన్నారు.

రైలు నుంచి జారిపడి ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన హోంమంత్రి అనిత

ప్రజాశక్తి-పాయకరావుపేట : తుని రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడి ఇంజనీరంగ్ విద్యార్థి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని వెంకటనగరం గ్రామానికి చెందిన గరికిన హేమన్‌రాజు (19) కాకినాడ సమీపంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ (మెకానికల్) ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రోజూ మాదిరిగానే కళాశాలకు వెళ్లేందుకు మంగళవారం ఉదయం తుని రైల్వే స్టేషన్లో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారి పడిపోవడంతో అతడి రెండు కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన హేమన్ రాజును చికిత్స నిమిత్తం తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో మృతి చెందాడు.



హేమన్‌రాజు (ఫైల్‌ఫొటో)

తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. హేమన్ రాజు తల్లిదండ్రులు గరికిన రామకృష్ణ, సత్యవతి దంపతులకు ముగ్గురు కుమారులు కాగా పెద్ద కుమారుడు సూర్యనారాయణ తండ్రితో కలసి సముద్రంపై చేపల వేటకు వెళుతుండగా, రెండవ కుమారుడు ఆటో నడుపుకుంటున్నాడు. చిన్న కుమారుడు హేమన్ రాజు తమలాగా కష్టపడకూడదని, ఉన్నత చదువులు చదివించాలని భావించిన వీరు తమ శక్తికి మించి ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో బిటెక్ చదివిస్తున్నారు. ఊహించని విధంగా హేమన్‌రాజు రైలు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. ఎంతో హుషారుగా అందరితో కలసిమెలసి తిరుగుతూ ఉండే హేమన్‌రాజు చిన్న వయసులోనే మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

హేమన్ రాజు రైలు ప్రమాదంలో మతి చెందిన ఘటనపై రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హేమన్ రాజు టిడిపికి వీరాభిమానని అని ఆమె పేర్కొన్నారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వ పరంగా, పార్టీ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

కార్యాలయ ఆవరణ ముంపునకు అధికారులే కారణం

ప్రజాశక్తి-కోటవురట్ల : మండల పరిషత్తు కార్యాలయ ఆవరణ ముంపునకు అధికారులే కారణమని పలువురు సభ్యులు నిలదీశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అప్పలనాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆర్ అండ్ బి స్థలంలో రోడ్డు ఆనుకొని శాశ్వత నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు మొద్దునిద్దర పోవడంతో నేడు ఎంపిడిఒ కార్యాలయం ఎదురుగా రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉండిపోతుందని వైసిపి ఎంపిపి దత్తుడురాజు తెలిపారు. ఆ వర్షపు నీటిని కార్యాలయంలోకి ఎలా మళ్లించారని ప్రశ్నించారు. దీనికి స్పందించిన టిడిపి సభ్యులు లింగన్న నాయుడు సమస్యను హోం మంత్రి అనిత దృష్టికి తీసుకువెళ్లామని, త్వరలో నిధులు మంజూరు అవుతాయని, శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన తరువాత రద్దీ పెరిగిందని, అదనపు బస్సులు నడపాలని, పాయకరావుపేట వరకు ప్రతిరోజూ కనీసం ఒక బస్సైన వేయాలని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. తహశీల్దారు తిరుమల బాబు, ఈఓపిఆర్‌డి కూర్మారావు, ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ ప్రసాదరావు, పలు శాఖల అధికారులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

పుట్టినరోజున పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలలోని కోనవానిపాలెం గ్రామానికి జనసేన నాయకుడు కోన దుర్గాప్రసాద్ తన కుమారుడు శివ యస్వంత్ పుట్టినరోజును పురస్కరించుకొని పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సేనాపతి బాబురావు, దారబోయిన సత్యనారాయణ, ధన దమ్మురాజు, కొర్ర శివ, కోన మురళికృష్ణ, రామకృష్ణ, కొర్ర రాము పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో ఆయుర్వేద వైద్యం అందిస్తున్న దృశ్యం

ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక గుండాలు జంక్షన్ శంకరన్ సమావేశ మందిరంలో బుధవారం ఎస్ఎన్ఎస్‌పి అభియాన్ కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 75 మంది రోగులను పరీక్షించి అవసరమైన ఆయుర్వేద మందులను ఉచితంగా అందజేశారు. మహిళల ఆరోగ్య సమస్యలు, దినచర్య, రుతు చర్య, యోగా, ఆయుర్వేద మొక్కలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యాధికారిణి కే లావణ్య, ఫార్మసిస్టు చౌదరి గణేష్, యోగా శిక్షకులు బి అప్పారావు, ఎం చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

స్త్రీల ఆరోగ్యానికి ప్రథమ ప్రాధాన్యత

ప్రజాశక్తి-మునగపాక : కూటమి ప్రభుత్వం బాలికలు, మహిళల ఆరోగ్యానికి ప్రథమ ప్రాధాన్యతనిస్తుందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక పీహెచ్సీలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆరోగ్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

కోటవురట్ల : స్వస్ట్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని స్థానిక సిహెచ్‌సిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాదరావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పట్ల లింగన్న నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు జనార్ధన్, జనసేన మండల అధ్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద స్వస్థ నారీ సశక్త్ పరివార్ భాగంగా డాక్టర్ తిరుపతిరావు ఆధ్వర్యాన వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఆడారి ఆనంద కుమార్, పలక రవి, డి.పరమేశ్వర్రావు, పి.అప్పారావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యాన మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు డోకల నరసింహమూర్తి, సర్పంచ్ వై.భవాని, చల్ల సత్యనారాయణమూర్తి, రొంగలి మహేష్ పాల్గొన్నారు.

యలమంచిలి : స్థానిక ఏరియా ఆసుపత్రిలో 'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ప్రారంభమైంది. సూపరింటెండెంట్ డాక్టర్ నీహారిక ఆధ్వర్యాన 150 మంది మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు.



కె.కోటపాడు సిహెచ్‌సిలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

సబ్బవరం : మండలంలోని గుల్లేపల్లి పిహెచ్‌సిలో మహిళల ప్రత్యేక వైద్య శిబిరాలు కార్యక్రమాన్ని స్థానిక ఎంపీపీ బోకం సూర్య కుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు మంగ శ్రీనివాస్, గొంప నరసింగరావు, వనం సత్యనారాయణ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుచ్చయ్యపేట, తురకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బుధవారం వైద్య సేవలు నిర్వహించారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 2 వరకు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి దొండ రాంబాబు, వైద్యాధికారుడు డి సంధ్యారాణి, కే వెంకటకృష్ణ, సర్పంచ్ సుంకర లక్ష్మి పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా మలేరియా అధికారి కె.వరహాలదొర పరిశీలించారు. 324 మంది రోగులు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారి పూజ్య మేఘన, రేడియేషన్ ఆనకాలజిస్ట్ డాక్టర్ హేమలత, పిహెచ్సి వైద్యురాలు వనజ, పాల్గొన్నారు.

గొలుగొండ : గొలుగొండ పిహెచ్‌సి వద్ద స్వస్థ నారీ సుస్థ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారులు శ్యామ్ కుమార్, కీర్తి ఆధ్వర్యంలో మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కృష్ణదేవిపేట పిహెచ్‌సి వద్ద జరిగిన కార్యక్రమంలో ఎంపిపి గజ్జలపు మణికుమారి, ఏఎల్.పురం సర్పంచ్ లోచల సుజాత, వైద్యాధికారులు గాయత్రి, జ్యోతి, హేమలత పాల్గొన్నారు.

మాడుగుల : స్థానిక 30 పడకల ఆసుపత్రిలో సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, తహసిల్దార్ రమాదేవి, ఎంపీపీ రాజారాం పాల్గొన్నారు. కింతల పిహెచ్‌సిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఝాన్సీ, సర్పంచ్ నందారపు సన్యాసిరావు, ఉండూరు దేవుడు పాల్గొన్నారు.

రోలుగుంట : రోలుగుంటలో పిహెచ్‌సి వైద్యాధికారి కెవి.శ్రావణి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మరో వైద్యాధికారులు మజీదాబేగమ్, శివప్రసాద్ పాల్గొన్నారు.

రావికమతం : మండలంలో కొత్తకోట పీహెచ్సీ కార్యాలయం వద్ద ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యాధికారిణి సురేఖ, ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు, సర్పంచ్ కోన లావరాజు, ఉప సర్పంచ్ పందల దేవ, ఎంపీటీసీ పూడి దేవ పాల్గొన్నారు.

తగరపువలస : స్థానిక మీ సేవా కేంద్రంలో స్వస్ట్ నారీ, స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా బుధవారం నిర్వహించిన వైద్యశిబిరంలో 254 మందికి వైద్య సేవలు అందించారు. వైద్యులు సుస్మిత, ఎ ఝాన్సీ, సిహెచ్.హేమలత, మౌనిక పాల్గొని రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు

పద్మనాభం : రేవిడి పిహెచ్‌సిలో వైద్యాధికారి లీలాప్రసాద్ ఆధ్వర్యంలో స్వస్థ నారీ స్వశక్త్ అభియాన్ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి కె.రాంబాబు, మాజీ ఎంపిటిసి ఎ.గంగరాజు వైసిపి నాయకులు కోన రమణ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మధురవాడ : వాంబేకాలనీలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో స్వస్థ నారీ- సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మహిళలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మోహన్‌కృష్ణ, వి.వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీలో పనులు వేగవంతం చేయాలి

పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్



పరిశీలిస్తున్న యువరాజ్, కలెక్టర్

ప్రజాశక్తి -నక్కపల్లి:పునరావాస కాలనీలో పనులు వేగవంతంగా పూర్తి చేయాలని పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్ సంబంధిత కాంట్రాక్టర్, అధికారులకు ఆదేశించారు. మండలంలో పెద భోదుగలం వద్ద ఏర్పాటు చేస్తున్న పునరావాస కాలనీలో బుధవారం పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్, కలెక్టర్ విజయ కృష్ణన్ పరిశీలించారు. వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా చేపట్టిన భూసేకరణలో నివాస గృహాలు కోల్పోయిన కుటుంబాలకు పెద భోదుగలం వద్ద పునరావాసం కల్పించనున్నారు. ఇందుకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. ఈ మేరకు యువరాజ్, కలెక్టర్ కాలనీ లో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనులకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. రోడ్లు, డ్రింకింగ్ వాటర్, ఎలక్ట్రిసిటీ వంటి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కాలనీలో మౌలిక వసతులు సక్రమంగా ఉండే విధంగా పనులు చేపట్టాలన్నారు. పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కుటుంబ పెద్దలకు పరిహారం జమ చేసామని, మిగిలిన వారికి కూడా త్వరలో జమ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఆర్డీవో రమణ, తహసిల్దారు నరసింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజు, నాయకులు పాల్గొన్నారు.

పిఎసిఎస్ అధ్యక్షులు వినతి

నక్కపల్లి:నక్కపల్లి పీఏసీఎస్‌లో రుణం తీసుకున్న రైతులకు సంబంధించి రుణం తీసుకున్న నగదును తగ్గించి మిగిలిన నగదును రైతుల బ్యాంక్ అకౌంట్ లలో జమ చేయాలని నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి కోరారు. బుధవారం నక్కపల్లి వచ్చిన పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్ కు, కలెక్టర్ విజయ కృష్ణన్ కు వినతిపత్రం అందజేశారు. వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ ఆధ్వర్యంలో మండలంలో సిహెచ్ఎల్ పురం, పెద తీనార్ల,చిన తీనార్ల, ఉపమాక, జానకయ్యపేట, రాజయ్యపేట, చందనాడ బుచ్చిరాజుపేట గ్రామాలలో సెకండ్ ఫేజ్ భూసేకరణలో ఈ గ్రామాలకు సంబంధించి సుమారుగా 1000 మంది రైతులు నక్కపల్లి పీఏసీఎస్‌లో రుణాలు తీసుకోవడం జరిగిందన్నారు. సంబంధిత రైతులకు భూ పరిహారం చెల్లించే ముందు, బ్యాంకు రుణం చెల్లించి తర్వాత, మిగిలిన నగదు రైతులకు జమ చేయాలన్నారు. అలా కాదని మొత్తం రైతులకు జమ చేస్తే సొసైటీ నష్టపోయే అవకాశం ఉందని తెలియజేశారు. సొసైటీ డైరెక్టర్ కోసూరి శ్రీనివాసరావు, సెక్రటరీ శ్రీనివాస్,సిబ్బంది ఖాన్ పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్.పురంలో శ్రీకామాక్షి విశ్వబ్రాహ్మణ వడ్రంగి పనివాళ్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బర్నికల వరప్రసాద్, తామరపల్లి శివ, గొల్తి తాతాజీ, శ్రీశైలపు శివప్రసాద్, బర్నేకల మణికంఠ, కట్టుమల్ల శ్రీనివాసు, వింజరపు వీర ప్రభ, గొల్తి వాసు, వంగ నాగేశ్వరరావు పాల్గొన్నారు

రోలుగుంట:రోలుగుంట మండలం జానకిరాంపురం గ్రామంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలు విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. విశ్వబ్రాహ్మణ సంఘం మండల కన్వీనర్ వైదేశి రమణ, మండల అధ్యక్షులు వేమవరపు నారాయణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి వైదేసి బంగారయ్య, కోకన్వీనర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లి : విరాట్ విశ్వకర్మ వెనుకబడిన తరగతుల సంక్షేమానికి చేసిన సేవలు ఆదర్శనీయమని జాయింట్ కలెక్టర్ ఎమ్.జాహ్నవి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా జెసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. డీఆర్ఓ వై.సత్యనారాయణరావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి కె.శ్రీదేవి, కలక్టరేట్ పరిపాలనాధికారి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం బంగారమెట్ట, వడ్డాది గ్రామాల్లో విశ్వబ్రాహ్మణ సేవ సంఘం ఆధ్వర్యాన విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం నిర్వహించారు.సంఘం నాయకులు దిమిలి రమేష్, చుక్కా వెంకట సత్తిరాజు, పెదపూడి ప్రసాద్, కడియం శ్రీనివాస్, ఎండపల్లి తులసిరావు పాల్గొన్నారు.



బంగారుమెట్టలో పూజలు చేస్తున్న నాయకులు

వేపగుంట : విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 95వ వార్డు చింతలఅగ్రహారం గ్రామంలోని బ్రహ్మం గారి మఠంలో విశ్వకర్మ జయంతి నిర్వహించారు. పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొని,విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలవేశారు. 95వ వార్డు అధ్యక్షులు రాపర్తి మాధవరావు, కాళ్ళ గంగాధర్, దాడి అర్జున్, బొడ్డేటి జగడ అప్పారావు, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు బొడ్డపల్లి హేమంత్ కుమార్, ఉగ్గిన నాగార్జున, జతిన్, సాయిరాంపాత్రుడు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి ఐదోవార్డు మారికవలస చైతన్య టెక్నో స్కూల్‌లో మధురవాడ విశ్వకర్మ కార్పెంటర్ కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో మొల్లి లక్ష్మణరావు, పిళ్ళా నర్సింగరావు, మన్యాల సోంబాబు, చెట్టిపల్లి గోపి, శేఖరి శ్రీనివాస్, పోతిన శ్రీనివాసరావు, ఎపివిశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పావులూరి హనుమంతరావు, జిల్లా అధ్యక్షులు శివకోటి శ్రీనివాసరావు పాల్గొన్నారు. మధురవాడ విశ్వకర్మ సంఘం స్టీరింగ్ సభ్యులు కురుమోజు గోవిందరావు, కొమ్మోజి చిన్న, గోలి సతీష్ పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయంలో విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి, ఎస్ఎస్.వర్మ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్ భవానీశంకర్, విశ్వకర్మ జిల్లా అధ్యక్షులు శివకోటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు కంప్యూటర్లు అందజేత

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలో ఉద్దండపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తుని ఐడిబిఐ బ్యాంకు లక్షా 50 వేల రూపాయల ఆర్థిక సాయంతో 4 కంప్యూటర్లు, టేబుల్స్, 3 ఐరన్ బీరువాలు బ్యాంకు ప్రతినిధులు బుధవారం హెచ్ఎం నాగన్న దొరకు అందజేశారు. ఈ సందర్భంగా ఐడిబిఐ రీజనల్ కార్యాలయం జనరల్ మేనేజర్ కే.దాసు మాట్లాడుతూ, తన విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాలలోనే కొనసాగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐడిబిఐ బ్యాంక్ ఆఫీసర్ రమేష్, మురళి, పి.సతీష్ కుమార్, ఏఎన్ఆర్ కిరణ్ కుమార్, రాజా రమేష్, సర్పంచ్ పొడగట్ల వెంకటేశ్వరరావు,ఎంపీటీసీ బచ్చుల రాజు, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, తుమ్మల వెంకటరమణ, బి రాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వెలగా శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దాసు

పాఠశాలల్లో ఎంఇఒ తనిఖీలు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని రొంగలపాలెం, జేపి.అగ్రహారం, కుసర్లపూడి పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి - 2 వి.జగ్గారావు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో రికార్డులను తనిఖీ చేసి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యంను స్వయంగా పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.



తనిఖీ చేస్తున్న ఎంఇఒ



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆర్‌టిఒ కార్యాలయం స్థల పరిశీలన

ప్రజాశక్తి-నర్సీపట్నం: బలిఘట్టం టిడ్కో గృహాల సమీపంలోని ప్రాంతీయ రవాణా అధికారి (ఆర్‌టిఒ) కార్యాలయ నిర్మాణం కోసమై కేటాయించిన సుమారు మూడు ఎకరాల స్థలాన్ని అధికారులు బుధవారం పరిశీలించారు. ఆర్టీవో రమేష్, మోటార్ వాహన ఇన్స్పెక్టర్లు వెంకటరమణ, అప్పన్న, తహశీల్దార్ రామారావు పాల్గొన్నారు. స్థలాన్ని సందర్శించి, నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలపై చర్చించారు. కార్యాలయ నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

గోపీనాథ్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గోపీనాథ్‌ను స్థానిక వేదిక ఫంక్షన్ హాల్లో బుధవారం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడు సత్కరించారు. పిఆర్‌టియు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వరహాల నాయుడు, రమేష్ పిఆర్టియు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు సిహెచ్ తలుపులు , జివిఎస్ నాగేంద్ర, ఎమ్మెస్ ప్రసాద్, జిల్లా అసోసియేటివ్ ప్రెసిడెంట్ కెవి రమణ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

ప్రజాశక్తి -నర్సీపట్నం: తమండలంలో బుధవారం కన్నంపేట, అమలాపురం గ్రామాలలో పశు వైద్యాధికారి నరేష్ సిబ్బందితో కలిసి టీకాలను పశువులకు వేశారు. ఈనెల 15 నుంచి వచ్చే నెల 15 వరకు నెల రోజులు పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని పాడి రైతులంతా తప్పనిసరిగా టీకాలను పశువులకు వేయించాలని కోరారు. బుధవారం 62 పశువులకు టీకాలు వేశారు, ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దేరు నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి -మాడుగుల:మండలంలో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పెద్దేరు జలాశయం గరిష్ట నీటి మట్టం 137.00మీ కాగా, ప్రస్తుతం జలాశయం నీటి మట్టం 136.60మీకు చేరి ప్రమాద స్థాయికి చేరుకుందని పర్యవేక్షణ అధికారి సుధాకర్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం జలాశయం లోనికి వరద నీరు సుమారు 518 క్యూసెక్కులు నీరు వస్తుందన్నారు. స్పిల్వే గెట్ 3 ద్వారా 400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు తెలిపారు. నదీ పరివాహక ప్రాంతం ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఎంపిడిఒల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- రావికమతం: రావికమతం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా మహేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ పైలరాజు, డీసీఎంఎస్ పూర్వపు చైర్మన్ ముక్కా మహాలక్ష్మి నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ.ఓ.పి.ఆర్.డి నుంచి పదోన్నతి పై ఎంపీడీవోగా నియమితులయ్యారు.



బుచ్చయ్యపేట, రావికమతం, ఎస్.రాయంలో బాధ్యతల స్వీకరిస్తున్న ఎంపిడిఒలు

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట ఎంపీడీఓగా శివప్రసాద్ నారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సబ్బవరం ఎంపీడీవో కార్యాలయంలో ఏఓగా పనిచేస్తూ ఎంపీడీఓగా పదోన్నతి పొంది బచ్చయ్యపేట మండలానికి వచ్చారు. ఈ మేరకు ఆయనకు ఎంపీపీ డి.నాగేశ్వరీదేవి, జడ్పిటిసి దొండ రాంబాబు, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలిపారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్చార్జి (ఎఫ్ఏసీ) ఎంపీడీవోగా పనిచేసిన హెచ్.బానోజీరావు పూర్తి స్థాయి ఎంపీడీవోగా పదోన్నతి పొంది కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం బదిలీపై వెళ్లారు.

ఎస్.రాయవరం:మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఎంపీడీవోగా పి మీనా కుమారి బాధ్యతలు స్వీకరించారు. పద్మనాభం డిప్యూటీ ఎంపిడిఓగా పనిచేసిన ఆమె పదోన్నతిపై రాయవరం ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ఇంచార్జి ఎంపిడిఓ జి.సత్యనారాయణ, డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు స్వాగతం పలికారు.

దోమ తెరల పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పప్పుశెట్టి పాలెం పంచాయతీ శివారు సుద్దలపాలెం, అడ్డలోవ గ్రామాల్లో బుధవారం వైద్య సిబ్బంది దోమ తెరలను పంపిణీ చేశారు. అనంతరం దోమతెరల ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బెల్లపు కొండలరావు, వీఆర్పీ పాల్గొన్నారు.

డ్రోన్‌లతో ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని భీమవరం చెక్ పోస్టు, పరిసర ప్రాంతాల్లో బుధవారం నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ ఆధ్వర్యంలో డ్రోన్‌ల ద్వారా తనిఖీలు నిర్వహించారు. అనంతరం వాహనాలను తనిఖీలు చేపట్టారు. గంజాయి అక్రమ రవాణా నిరోధానికి, అసాంఘిక కార్యకలాపాలు అడ్డుకట్ట వేసేందుకు ఈ డ్రోన్ తనిఖీ ఉపయోగపడుతుందని సీఐ అన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఎస్సై రామారావు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న కార్మికులు

పంచాయతీ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంటలో బుధవారం పంచాయతీ కార్మికులు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయు మండల నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు కనీసం వేతనం ఇవ్వాలని,ి పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలన్నారు. ఐడీ కార్డులు, గ్లౌజులు వంటివి ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, 20ఏళ్ల నుండి పని చేస్తున్న కార్మికుల పిల్లలకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.



సత్తాచాటిన క్రీడాకారులు

స్కూల్ గేమ్స్‌లో సత్తా

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఉమ్మడి విశాఖ జిల్లా అండర్ 17 స్కూల్ గేమ్స్ వుషు పోటీల్లో నర్సీపట్నంకు చెందిన క్రీడాకారులు సత్తాచాటారు. సంస్కృతీ గ్లోబల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా లెవెల్ వుషు అండర్ 17 సంవత్సరాల బాల బాలికల పోటీలలో బి.ఆర్ అంబేద్కర్ సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు 9 గోల్డ్ మెడల్స్, స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థులకు 1 గోల్డ్ మెడల్ సాధించి స్టేట్ స్కూల్ గేమ్స్ ఉషు పోటీలకు అర్హత సాధించారని శాప్ కోచ్ అబ్బు మీడియాకు బుధవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ సాయి, ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరి విజేతలకు అభినందనలు తెలిపారు. 14 మంది పోటీలలో పాల్గొనగా 10 మంది ఎంపిక అయ్యారు వీరికి ఉషు కోచ్ వేపాడ ప్రియాంక, మల్లికా శిక్షణ ఇచ్చారు.



ఆట స్థలాన్ని పరిశీలిస్తున్న సిఐ

4 నుంచి రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్.పురం జిల్లా పరిషత్ హైస్కూల్లో అక్టోబర్ 4 5, 6, తేదీల్లో 13 జిల్లాలకు సంబంధించి రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా బుధవారం నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ ఏఎల్.పురం హైస్కూల్ స్థలం పరిశీలించారు.

తాగునీరు, వసతి సదుపాయాలపై సమీక్షించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ,ఈ పోటీల్లో 13 జిల్లాల నుండి 26 జట్లు పాల్గొంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు వై.తారకేశ్వరరావు, రామారావు, విద్యాకమిటీ చైర్మన్ లగుడు రాజు, ప్రధానోపాధ్యాయులు కృష్ణప్రసాద్, పిడి జి.నర్సింగరావు, జి.మాధవి పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న విద్యార్థులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: విద్యార్థులకు పెండింగ్ లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని బుధవారం స్థానిక ఎన్టీఆర్ మిని స్టేడియం వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నేతలు ఫణీంద్ర, నాగభూషణం మాట్లాడుతూ, నిర్మాణాలు ప్రారంభించిన మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయ వద్దని డిమాండ్ చేశారు. స్పీకర్ అయ్యన్న, రాష్ట్ర హోంమంత్రి అనిత, పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్‌లు మెడికల్ కళాశాలలను నిర్మించుకోకపోవడం చాలా సిగ్గుచేటన్నారు.రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల్ని పూర్తిగా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రవి, దేవ తదితరులు పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్క్‌ను ఐక్యతతో తిప్పికొట్టాలి

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి- నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్‌ను పార్టీలకు అతీతంగా ఐక్యంగా పోరాటం చేసి తిప్పి కొట్టాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం పిలుపునిచ్చారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 4వ రోజుకు చేరింది. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు, జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, తదితరులు మత్స్యకారుల ఆందోళనకు సంఘీభావం తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, ఈ ప్రాంత వాసులు రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా పోరాటం చేసి పరిశ్రమను తిప్పి కొట్టాలన్నారు. 2013 భూ సేకరణ చట్టాన్ని ఉల్లంఘించి పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారన్నారు. గ్రామ సభలు నిర్వహించాలని, 80 శాతం ప్రజలు ఆమోదం తెలపాలని, ఇవేమీ జరపకుండా చట్ట ఉల్లంఘనకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మత్స్యకారులు, నాయకులపై కేసులు పెట్టడం సరికాదని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై పోలీసులు కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే, అనుమతి లేదని ఆంక్షలు విధించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇప్పటికే హెటిరో పరిశ్రమతో మత్స్య సంపద నశించిపోయి, మత్స్యకారులు ఉపాధి కోల్పోయారని, అనేక వ్యాధుల బారిన పడ్డారని, బల్క్ డ్రగ్ వస్తే మత్స్యకారుల మనుగడ ప్రశ్నార్ధకమే అని అన్నారు. మత్స్యకారుల పోరాటగళం సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ కు వినిపించాలన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.

జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు మాట్లాడుతూ బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే మత్స్యకార బతుకులు బుగ్గిపాలవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.



రిలే దీక్ష చేపడుతున్న లోకనాథం, మత్స్యకారులు

వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి మాట్లాడుతూ శాంతియుతంగా పోరాటం చేస్తున్న మత్స్యకారులు, నాయకుల పైన పోలీసులు కేసులు పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. మత్స్యకారులకు నష్టం చేకూర్చే బల్క్ డ్రగ్ ఏర్పాటును నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. బల్క్ డ్రగ్ పార్క్ వద్దే వద్దంటూ మత్స్యకారులు,నాయకులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, మత్స్యకార నాయకులు ఎరిపిల్లి నాగేశ్వరరావు (నాగేష్), మైలపల్లి మహేష్ బాబు, కోడ కాశీరావు, పిక్కి తాతలు, చేపల సోమేష్, బైరాగి రాజు పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి -నక్కపల్లి: సిఫార్సు చేసిన మేర ఎరువుల తో పాటు జీవన ఎరువులకు రైతులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ సూచించారు. మండలంలో బుధవారం కాగిత, గునుపూడి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. జీవన ఎరువులు ఫాస్పరస్ సొల్యూబిలిజింగ్ బాక్టీరియా(పి ఎస్ బి) పొటాష్ రిలీజింగ్ బాక్టీరియా) ప్రాధాన్యతపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దసరా పందిరి రాటోత్సవాలు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని ఉపమాక గ్రామంలో దుర్గాదేవి ఆలయం వద్ద బుధవారం పందిరి రాట వేశారు. ఈనెల 22 నుండి వచ్చేనెల 2 వ తేదీ వరకు దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మహేష్, పెద్దలు కొప్పిశెట్టి వెంకటరమణ, సిద్దాబత్తుల కృష్ణ, కొప్పిశెట్టి బుజ్జి, చెరుకూరి వెంకటేశ్వరరావు, ప్రగడ వీరబాబు, కొప్పిశెట్టి శ్రీను, కొప్పిశెట్టి లచ్చబాబు, వరహాలరావు, కొల్లాటి బుజ్జి , తోలేటి శ్రీనివాస్, తోట రాజు, గరగ బాబు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల: మాడుగులలోని దేవీ నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పందిరి రాటను వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, అనకాపల్లి జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు శ్రీనాథ్ శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ,ఉపసర్పంచ్ జవ్వాది వరహాలు, ఆలయ అధ్యక్షులు ఎస్వీ కొండలరావు, కార్యదర్శి అన్నం వీడి ప్రసాద్ రావు పాల్గొన్నారు,

బకాయిలు విడుదల చేయాలని ధర్నా

ప్రజాశక్తి-చోడవరం

గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు, కార్మికులకు బకాయిలు వెంటనే చెల్లించాలని, ఈనెల 30వ తేదీ లోపు ఫ్యాక్టరీ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించాలని డిమాండ్ చేస్తూ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ గేటు వద్ద రైతులు, కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఫ్యాక్టరీ అధోగతి పాలైందని, బంగారు బాతులాంటి ఫ్యాక్టరీని నేడు మూసివేత దిశగా పాలకవర్గాలు తీసుకెళ్లాయని విమర్శించారు. ఫ్యాక్టరీ వచ్చే సీజన్లో ఫ్యాక్టరీ నడుస్తుందో లేదో అనే భయాందోళన రైతుల్లో నెలకొందన్నారు. 2024-25 సీజన్లో చెరుకు తోలిన రైతాంగానికి, ఫ్యాక్టరీలో పనిచేసిన కార్మికులకు, కాటాల వద్ద పని చేసిన కళాసిలకు బకాయిలు చెల్లించకపోవడంతో వారు అప్పులు పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్యాక్టరీ ఆధునీకరణ చేయకపోతే ప్రత్యక్షంగా పరోక్షంగా లక్ష కుటుంబాలు ఉపాధి లేక వలసలు పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ఎస్.రాజు, బండారు సత్యనారాయణమూర్తి ఫ్యాక్టరీని కాపాడుతామని ఎన్నికల్లో హామీలిచ్చి నేడు పీక నులిమేశారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే బకాయిలు విడుదల చేయాలని, ఫ్యాక్టరీ నడుస్తుందని భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, డి తాతారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, ఫ్యాక్టరీ కార్మిక నాయకులు రాముునాయుడు, రైతు కూలీ సంఘం నాయకులు కోన మోహన్, భాస్కర్, రైతు నాయకులు ఏడువాక శ్రీనివాసరావు, తనకాల జగన్, నాగిరెడ్డి సత్యనారాయణ, పీల వెంకటరమణ, వనం సూర్యనారాయణ, సబ్బవరపు ముత్యాల నాయుడు పాల్గొన్నారు.



గోవాడ సుగర్ ఫ్యాక్టరీ గేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు, కార్మికులు, నాయకులు

ఎపిఐఐసి భూముల పరిశీలన

ప్రజాశక్తి-కోటవురట్ల : మాకవరపాలెం మండలం రాచపల్లి గ్రామ సమీపంలోని ఏపీఐఐసీ భూములను బుధవారం పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పరిశీలించారు. సర్వేనెంబర్ 431, 432 వగైరాల్లోని సుమారు 292 ఎకరాల భూమిని పరిశీలించి భూమి భౌగోళిక స్థితి గతులపై ఆరా తీశారు. నీటి వనరులు రహదారి ఇతరత్రా వివరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎరకన్నపాలెం గ్రామం నుండి ఎలమంచిలి వెళ్లే రోడ్డు మార్గాన్ని పరిశీలించారు. సర్వే నంబర్ 737 వద్ద 406 ఎకరాలు కొండ పోరంబోకు భూమి సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీఓ వి.వి.రమణ, మాకవరపాలెం తహశీల్దార్ వెంకటరమణ, నర్సీపట్నం తహశీల్దార్ రామారావు, జిల్లా సర్వే అధికారి గోపాలరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



భూమి రికార్డులు పరిశీలిస్తున్న యువరాజ్, విజయ కృష్ణన్

భూలోక నాయుడుకు భరత్ పరామర్శ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఐ న్యూస్ ఎడిటర్, సంఘ సేవకుడు బుద్ధ భూలోకనాయుడు కుమార్తె ఇటీవల మరణించగా, వారి పెద్ద కర్మకు బుధవారం వైసిపి అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ విచ్చేసి భూలోక నాయుడును పరామర్శించారు. ఆయన వెంట వైసిపి కసింకోట మండల ప్రెసిడెంట్ మలసాల కిషోర్, 80వార్డు ఇంచార్జ్ కేయం నాయుడు, నాయకులు కొణతాల మురళీకృష్ణ, బొడ్డేడ శివ, వేగి త్రినాథ్, కాంగ్రెస్‌గుల రాము, కిట్టు ఉన్నారు.

వరి పొలాలు పరిశీలన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల వ్యవసాయ అధికారిణి ఎల్.వై.కాంతమ్మ దేవరాపల్లి, సంతతోటలోని వరి పొలాన్ని సందర్శించి, రైతులకు పలు సూచనలు చేశారు